




- నేటి నుంచే వైకుంఠ ఏకాదశి అధ్యయనోత్సవాలు
- సర్వం సిద్ధం చేసిన దేవాలయ అధికారులు
- దశావతారాల్లో దర్శనమివ్వనున్న రామయ్య
- జనవరి 10 నుంచి 20వరకు రాపత్తు సేవలు
- 21 నుంచి 23వరకు విలాసోత్సవాలు
- నేటినుంచి 10వరకు నిత్య కల్యాణాల నిలిపివేత

శోభాయమానం భద్రాద్రి క్షేత్రం



భద్రాచలం, డిసెంబరు 30 (ఆంధ్రజ్యోతి): భద్రాచలంలోని శ్రీసీతారామచంద్రస్వామి దేవస్థానం ఆధ్వర్యంలో మంగళవారం నుంచి వైకుంఠ ఏకాదశి అధ్యయనోత్సవాలు ప్రారంభం కానున్నాయి. ఈ నేపథ్యంలో భద్రాద్రి దేవస్థానం అధికారులు ఇందుకు సంబంధించిన ఏర్పాట్లను పూర్తి చేశారు. కల్యాణ మండపం ప్రాంగణంలో చలువ పందిళ్లు, చాందినీ వస్త్రాలతో అత్యంత శోభాయమానంగా వేదికను తీర్చిదిద్దారు. అలాగే రామాలయ ప్రాంగణాన్ని రంగవల్లులు, చలువ పందిళ్లు, చాందినీ వస్త్రాలంకరణలతో అందంగా అలంకరించారు. కాగా ఆలయానికి విద్యుత్తు దీపాలంకరణ చేయడంతో రామాలయం దేదీప్యమానంగా ప్రకాశిస్తోంది. మంగళవారం నుంచి జనవరి 8 వరకు దశావతారాల అలంకారాల్లో రామయ్య భక్తులకు దర్శనమివ్వనున్నారు.

ఈ క్రమంలో పట్టణంలోని ప్రధాన కూడళ్లలో స్వాగత ద్వారాలు ఏర్పాటు చేశారు. ఆలయ పరిసరాలు అందంగా తీర్చిదిద్దుతుండటంతో ముక్కోటి శోభ సంతరించుకుంది. జనవరి 9న తిరుమంగై ఆళ్వార్ పరమపదోత్సవం నిర్వహించనున్నారు. అలాగే సాయంత్రం పవిత్ర గోదావరిలో శ్రీసీతారామచంద్ర స్వామివారికి తెప్పోత్సవం నిర్వహించనుండగా పగల్ పత్తు ఉత్సవాలు ముగియనున్నాయి. 10న వైకుంఠ ఏకాదశిని పురస్కరించుకొని ఉత్తర ద్వారంలో స్వామి వారు భక్తులకు దర్శనమివ్వనున్నారు. కాగా రాత్రి పోలీసుశాఖ ఆధ్వర్యంలో డీఎస్పీ బంగ్లాలోని శ్రీరామ రక్ష మండపంలో రాపత్తు ఉత్సవాలు ప్రారంభం కానున్నాయి.

తొలక్కంతో శ్రీకారం

అధ్యయనోత్సవాల్లో భాగంగా చతుర్వేద పారాయణం, రామాయణ పారాయణం చేసే రుత్వికులకు దీక్షా వస్త్రాలను భద్రాద్రి (మిగతా 4వ పేజీలో)



మీడియా సమావేశంలో మాట్లాడుతున్న మంత్రి తుమ్మల

ప్రజల నమ్మకాన్ని నిలబెడతా

- 40 ఏళ్లుగా వారి సహకారం మరువలేనిది
- ఖమ్మం లకారం ట్యాంక్‌బండ్ వద్ద శిల్పారామం
- నెహ్రూ జూపార్క్ తరహాలో వెలుగుమట్ల అటవీపార్క్
- నగరాన్ని ఎడ్యుకేషన్ హబ్‌గా మారుస్తాం
- ప్రభుత్వ మెడికల్ కాలేజీ వద్ద సింథటిక్ స్టేడియం
- సంక్రాంతి రోజు మంచుకొండ ఎత్తిపోతల శంకుస్థాపన
- వ్యవసాయశాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు

ఖమ్మం, డిసెంబరు 30 (ఆంధ్రజ్యోతి ప్రతినిధి): తన 40 ఏళ్ల రాజకీయ జీవితంలో ఖమ్మం జిల్లా ప్రజల సహకారం మరువలేనిదని వ్యవసాయశాఖ తుమ్మల నాగేశ్వరరావు తెలిపారు. తనను నమ్మిన ప్రజల రుణం తీర్చుకునేందుకు మరింతగా కృషి చేస్తానన్నారు. జిల్లాలో తలపెట్టిన అభివృద్ధి పనులన్నీ సకాలంలో పూర్తి చేయించేందుకు 2025లో ఆయా పనుల్లో వేగం పెంచుతామన్నారు. ఖమ్మంలో సోమవారం విలేకరుల సమావేశంలో మంత్రి తుమ్మల మాట్లాడుతూ జిల్లా రాజకీయాల్లో 40 ఏళ్లుగా ప్రజలు తనను ఆదరించి ఆశీర్వదిస్తున్నారని, వారి నమ్మకానికి అనుగుణంగా జిల్లాను అభివృద్ధిలో పరుగులు తీయించేలా కృషి చేస్తానన్నారు. ఖమ్మం నగరం ఎంతో అభివృద్ధి చెందుతోందన్నారు. హైదరాబాదు తరహాలో లకారం ట్యాంక్‌బండ్ వద్ద శిల్పారామం ఏర్పాటు (మిగతా 4వ పేజీలో)

సకాలంలో కురిసిన వర్షాలు.. సాగర్ ఆయకట్టుకు నీరు.. ప్రభుత్వం చేసిన రుణమాఫీ.. సన్న ధాన్యం పండించిన రైతులకు అందిన బోనస్.. ఇలా అనేక అనుకూల అంశాలతో జిల్లా రైతులు ఈ సంవత్సరం సంతోషాల సాగు చేశారు. వాతావరణం అనుకూలించడంతో పంటలకు చీడపీడల బాధలు లేకపోవడంతో దిగుబడులు కూడా ఆశాజనకంగానే వచ్చాయి. ముఖ్యంగా ఆయిల్‌పామ్ రైతులకు ఈ సంవత్సరం లాభాల పంట పండింది. టన్ను గెలల ధర రూ.20,400కు పెరగడంతో రైతులు భారీగా ఆదాయం పొందారు. అయితే వానాకాలం సీజన్ ప్రారంభంలో కురిసిన భారీ వర్షాలతో వచ్చిన అనూహ్య వరదలతో పలుచోట్ల పంటపొలాలు తీవ్రంగా దెబ్బతిన్నాయి. ఆయా భూములకు సంబంధించిన రైతులు పంటలను కోల్పోయారు. ఇదే సమయంలో ప్రభుత్వం పంటలను కోల్పోయిన రైతులకు నష్టపరిహారం అందించి ఆదుకుంది.

-ఆంధ్రజ్యోతి ప్రతినిధి, ఖమ్మం

సాగు సంబురం

- కాలం కలిసిరావడంతో 2024లో పుష్కలంగా పంటలు
- రైతులకు వరంగా రూ.2లక్షల రుణమాఫీ
- ఆయిల్‌పామ్‌కు రికార్డు ధర.. పెరిగిన సాగు
- ధాన్యం, పత్తికి దక్కిన 'మద్దతు'
- సన్నధాన్యం రైతులకు 'బోనస్' ఆదాయం
- మిర్చి రైతులకు నిరాశ మిగిల్చిన ధర
- సీజన్ ప్రారంభంలో దెబ్బకొట్టిన భారీ వర్షాలు, వరదలు

4





న్యూ ఇయర్ వేడుకలు ప్రశాంతంగా జరుపుకోవాలి..

- జిల్లా అంతటా ప్రత్యేకంగా డ్రంక్ అండ్ డ్రైవ్ తనిఖీలు
- రాత్రి ఒంటి గంట తర్వాత బయటకు వస్తే కేసులు
- సీపీ సునీల్‌దత్

4



భద్రాచలం ఏఎస్పీగా విక్రాంత్ కుమార్

- స్వస్థలం యూపీ.. 2022 బ్యాచ్ ఐపీఎస్
- గతంలో జిల్లాలో ప్రాబేషనరీ అధికారిగా విధులు

ఆంధ్రజ్యోతి

కార్ అండ్ బైక్ రేస్



డిసెంబర్ నెల కూపన్ నంబర్ - 3

పాఠకుని పూర్తి పేరు	:	....
డోర్ నెంబరు	:	....
వీధి పేరు	:	....
గ్రామం / పట్టణం	:	....
మండలం	:	....
జిల్లా	:	....
పోస్టల్ పిన్‌కోడ్	:	....
ఫోన్ నంబర్	:	....

నాలుగు నెలల్లో ఆంధ్రజ్యోతి డ్రాలో ఇది డిసెంబర్ నెల మూడవ కూపన్ ఈ కూపన్‌లో మీ అడ్రస్ పూర్తి చేసి ఈ నెలలో ఇచ్చే మూడు కూపన్లను ఒక సెట్‌గా చేసి మీ వద్దనే ఉంచి మూడు నెలలు అయిన తర్వాత మొత్తం 9 కూపన్లను మూడు సెట్లుగా చేసి 2025 మార్చ్ నెల 10వ తేది నాటికి ఈ క్రింది అడ్రస్‌కు పోస్ట్ ద్వారా కాని, స్వయంగా కాని అందచేయవలెను.

నోట్ : సెట్‌గా కాకుండా విడిగా పంపిన కూపన్లు చెల్లవు.

* చట్ట ప్రకారం నిబంధనలు వర్తించును.




కూపన్లు పంపవలసిన చిరునామా

సర్క్యులేషన్ మేనేజర్, ఆంధ్రజ్యోతి కార్యాలయం
IDA ఫ్లాట్ నెం-112. శ్రీ అభయవేంకటేశ్వరస్వామి టెంపుల్ రోడ్
ఇండస్ట్రియల్ ఏరియా, ఖానాపురంహవేలి, ఖమ్మం. పిన్‌కోడ్ - 507002
సర్క్యులేషన్ మేనేజర్ : 9985411350
బ్రాంచ్ మేనేజర్ : 9985411345

సెల్‌ఫోన్ కొనివ్వలేదని...

- ఉరివేసుకుని యువకుడి ఆత్మహత్య
- వెంగన్నపాలెంలో విషాదం



జూలూరుపాడు, డిసెంబరు 30 (ఆంధ్రజ్యోతి): తల్లిదండ్రులు స్మార్ట్ సెల్‌ఫోన్ కొనివ్వలేదని మనస్తాపానికి గురై మండలంలోని వెంగన్నపాలెం గ్రామానికి చెందిన ఇల్లంగి సాకేత్ (21) అనే యువకుడు ఉరివేసుకుని సోమవారం ఆత్మహత్యకు పాల్పడ్డాడు. పోలీసులు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. వెంగన్నపాలెం గ్రామానికి చెందిన సంగీతరావు-సౌజన్య దంపతులకు ఇద్దరు కుమారులు. పెద్ద కుమారుడు సంపత్ హైదరాబాద్‌లోని ప్రైవేట్ కంపెనీలో ఉద్యోగం చేస్తున్నాడు. చిన్న కుమారుడు సాకేత్ ఐటీఐ పూర్తి చేసి ఇంటి వద్దనే ఉంటూ తండ్రితోపాటు హమాలీ పనులకు వెళుతున్నాడు. తన స్నేహితులు ఖరీదైన సెల్‌ఫోన్లు వాడుతున్నారని, తనకు కూడా అలాంటి సెల్‌ఫోన్ కొనివ్వాలని తల్లిదండ్రులతో పలుమార్లు అన్నాడు. కొత్త సంవత్సరం వస్తుందని మొబైల్ ఫోన్ కొనివ్వాలని ఉదయం తండ్రితో చెప్పగా తర్వాత కొనిస్తానని కొడుకుకు సర్దిచెప్పి హమాలీ పనికి వెళ్లాడు. దీంతో మనస్తాపానికి లోనైన సాకేత్.. తల్లి సౌజన్య ఇంట్లో లేని సమయంలో ఫ్యాన్‌కు ఉరివేసుకున్నాడు. తల్లి బయట నుంచి ఇంటికి వచ్చే సరికి కుమారుడు ఫ్యాన్‌కు ఉరివేసుకుని కనిపించాడు.

బాలుడిని నరికి చంపిన కసాయి

- కుటుంబాల మధ్య గొడవలే కారణమని అనుమానం
- భద్రాద్రి జిల్లా సరిహద్దులోని ఎటపాక మండలంలో ఘటన

4





కంటితుడుపుగా చేప పిల్లల సరఫరా

- రొయ్య పిల్లల సరఫరాను విస్మరించిన సర్కారు
- రాష్ట్రంలోనే ఉచిత చేపపిల్లల సరఫరాలో అగ్రభాగాన ఖమ్మం జిల్లా

వైరా, డిసెంబరు 30 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడిన ఏడాదిలోనే ఉచిత చేపపిల్లల సరఫరా కంటితుడుపు వ్యవహారంగా ముగిసింది. ఉచిత రొయ్యపిల్లల సరఫరాను పూర్తిగా విస్మరించారు. అయితే ఉచిత చేపపిల్లల సరఫరాలో రాష్ట్రం మొత్తంమీద ఖమ్మంజిల్లా అగ్రభాగాన నిలిచింది. ఇక్కడి మంత్రులు, ఎమ్మెల్యేలు, అధికారుల చొరవ ఫలితంగానే ఉచిత చేపపిల్లల సరఫరా మొదటిస్థానంలో నిలిచింది. గత బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో 2017-18 నుంచి రాష్ట్రంలో ఉచిత చేపపిల్లలు, రొయ్యపిల్లల సరఫరా చేపట్టారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక 2024-25 లో రాష్ట్రం మొత్తం మీద 90.42కోట్ల చేపపిల్లలను సరఫరా చేయాల్సి ఉంది. అయితే కేవలం 28.85కోట్ల (31.90శాతం) ఉచిత చేపపిల్లలను మాత్రమే పోశారు. ఆ తర్వాత చేపపిల్లల సరఫరాను నిలిపివేశారు. ఉచిత రొయ్యపిల్లల సరఫరా పూర్తిగా అమలుకాలేదు. ఆ పిల్లల సరఫరాలో ప్రభుత్వం విఫలమైందనే విమర్శలున్నాయి. రాష్ట్రంలోని 32జిల్లాల్లో పరిస్థితి ఈ విధంగా ఉంటే ఖమ్మంజిల్లాలో మాత్రం ఉచిత చేపపిల్లల సరఫరాలో మెరుగైన అవకాశాలను అందిపుచ్చుకుంది.

14,158 చెరువుల్లో మాత్రమే చేపపిల్లల విడుదల...

రాష్ట్రంలోని 33 జిల్లాల్లో 29,434 చెరువులు, కుంటలు ఉన్నాయి. వీటికి ఉచిత చేపపిల్లల సరఫరా 90.42కోట్లు అవసరముంది. రూ.72కోట్ల నిధులను ఈ చేపపిల్లల సరఫరాకు మంజూరు చేశారు. అక్టోబరు ఐదోతేదీన ఈ చేపపిల్లల సరఫరాను ప్రారంభించి నవంబరు మధ్యనాటికి చేపపిల్లల సరఫరాను నిలిపివేశారు. 29,434జలాశయాల్లో 90.42కోట్ల చేపపిల్లలను విడుదల చేయాల్సి ఉండగా.. కేవలం 14,158 జలాశయాల్లో మాత్రమే 28.85కోట్ల చేపపిల్లలను విడుదల చేశారు. రూ.72కోట్లకుగానూ రూ.32కోట్ల నిధులు మాత్రమే ఖర్చుచేశారు. ఇకపోతే దాదాపు పదికోట్ల రొయ్యపిల్లలను జలాశయాల్లో పోయాల్సి ఉంది. అయితే రొయ్యపిల్లల సరఫరాకు కనీసం టెండర్లను కూడా ఆహ్వానించలేదు. ఈ రొయ్యపిల్లల సరఫరా కోసం తమవంతు కృషిచేస్తామని, ఖమ్మంజిల్లాకు చెందిన మంత్రులు, ఎంపీలు హామీ ఇచ్చినా అమలుకు నోచుకోలేదు.

2023-24 లో చేపపిల్లల సరఫరా ఇలా

2023-24 సంవత్సరంలో రాష్ట్రంలోని 33 జిల్లాల్లోని 23,130చెరువుల్లో 76.37కోట్ల చేపపిల్లలను





(84.50శాతం)విడుదల చేశారు. రూ.72కోట్లతో 90.37కోట్ల చేపపిల్లల సరఫరాకు టెండర్లు పిలిచారు. అయితే అప్పుడు కూడా నూరుశాతం చేపపిల్లలను సరఫరా చేయలేదు. 84.50శాతం చేపపిల్లలను విడుదల చేశారు. ఈ ఏడాది మాత్రం చేపపిల్లల సరఫరా 31.90 శాతానికే పరిమితమైంది. గతేడాది రూ.25కోట్లతో పదికోట్ల రొయ్యపిల్లలకుగానూ 9.15 కోట్ల రొయ్యపిల్లలను 357జలాశయాల్లో పోశారు.

ఖమ్మంజిల్లా పరిస్థితి...

ఈ ఏడాది ఖమ్మం జిల్లాలో రెండు విడతలుగా 821 జలాశయాల్లో 2.68కోట్ల (95శాతం) ఉచిత చేపపిల్లలను పోశారు. 876 జలాశయాల్లో చేపపిల్లలు పోసేందుకు ప్రభుత్వం అనుమతించినా కోర్టు కేసులు ఇతర కారణాల వలన 55 జలాశయాల్లో చేపపిల్లలను విడుదల చేయలేకపోయారు. మొత్తం 3.86కోట్ల చేపపిల్లలు అవసరం కాగా ప్రభుత్వం 2.80కోట్ల చేపపిల్లలకు మాత్రం అనుమతించగా 2.68కోట్ల (95శాతం) చేపపిల్లలను విడుదల చేశారు. ఇంకా 12లక్షల చేపపిల్లలను ఇతర జలాశయాల్లో విడుదల చేయలేకపోయారు. ఇదే ఖమ్మంజిల్లాలో 2023-2024లో 3.86కోట్ల ఉచిత చేపపిల్లల సరఫరాకు ప్రభుత్వం టెండర్లు పిలిచి కాంట్రాక్టు ఖరారు చేసింది. అయితే ఆసమయంలో 876 జలాశయాలకుగానూ కేవలం 313 జలాశయాల్లో 59.60 లక్షల (15శాతం)చేపపిల్లలను మాత్రమే విడుదల చేశారు. మిగిలిన చేపపిల్లలను సరఫరా చేయడంలో అధికారులు అప్పట్లో పూర్తిగా విఫలమయ్యారు. అయితే ఈ ఏడాది మాత్రం మిగిలిన 32జిల్లాల కంటే ఖమ్మంజిల్లా మాత్రం ఉచిత చేపపిల్లల సరఫరాలో ముందు వరుసలో నిలిచింది. రొయ్యపిల్లల సరఫరాకు ప్రభుత్వం అనుమతించకపోవడంతో అన్ని జిల్లాల తరపున ఖమ్మంజిల్లా కూడా నిల్చింది.

ఆర్చరీ పోటీలకు సర్వం సిద్ధం

- నగరంలో నేటినుంచి సీఎం కప్ రాష్ట్రస్థాయి పోటీలు
- హాజరుకానున్న సుమారు 150మంది క్రీడాకారులు

ఖమ్మం స్పోర్ట్స్, డిసెంబరు 30 (ఆంధ్రజ్యోతి): సీఎం కప్ రాష్ట్రస్థాయి బాలుర, బాలికల ఆర్చరీ పోటీల నిర్వహణకు నగరంలోని సర్దార్‌పటేల్ స్టేడియం ముస్తాబైంది. పోటీలకు రాష్ట్రవ్యాప్తంగా 33జిల్లాల నుంచి సుమారు 150మంది క్రీడాకారులు హాజరుకానున్నారు. ఈ మేరకు జిల్లా ఆర్చరీ అసోసియేషన్ సభ్యులు స్టేడియంలో పోటీలు నిర్వహించడానికి టార్గెట్లు, పోటీలు నిర్వహించే పాయింట్లను సిద్ధం చేశారు. ఈ సందర్భంగా సోమవారం వివిధ జిల్లాలనుంచి క్రీడాకారులు నగరానికి చేరుకొని తమ పేర్లను నమోదు చేసుకున్నారు. పోటీల్లో పాల్గొనేందుకు రాష్ట్రవ్యాప్తంగా ఇప్పటికే సుమారు 93 మంది క్రీడాకారులు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోగా, అనివార్య కారణాలచే ఆన్‌లైన్‌లో నమోదు కాని క్రీడాకారులు ఆయా జిల్లాల క్రీడాశాఖల అధికారుల సిఫారసుతో సుమారు 50 నుంచి 60మంది క్రీడాకారులు పోటీలకు రానున్నారని ఆర్చరీ అసోసియేషన్ బాధ్యులు తెలిపారు. వారితోపాటు మరో 30 మంది టెక్నికల్ సిబ్బంది సైతం హాజరు కానున్నారు. నగరంలో రెండు రోజులపాటు రాష్ట్రపోటీల్లో పాల్గొనే క్రీడాకారులకు ఎటువంటి ఇబ్బందులు కలగకుండా జిల్లా క్రీడల శాఖ ఉచిత భోజన, వసతి ఏర్పాట్లను కల్పించారు. పోటీల్లో భాగంగా ఇండియన్ రౌండ్, రికర్వ్, కాంపౌండ్ 30, 40, 50, 60 మీటర్ల సింగిల్స్, డబుల్స్ విభాగాల్లో పోటీలు నిర్వహించనున్నారు.

బాలుడిని నరికి చంపిన కసాయి

- కుటుంబాల మధ్య గొడవలే కారణమని అనుమానం
- భద్రాద్రి జిల్లా సరిహద్దులోని ఎటపాక మండలంలో ఘటన

దుమ్ముగూడెం, డిసెంబరు 30 (ఆంధ్రజ్యోతి): భద్రాద్రి జిల్లా దుమ్ముగూడెం మండల సరిహద్దున ఏపీలోని ఎటపాక మండలం మద్దిమడుగులో సోమవారం అత్యంత దారుణ ఘటన జరిగింది. ఓ బాలుడిని అతడి సమీప బంధువు గొడ్డలితో నరికిచంపాడు. దుమ్ముగూడెం మండలం కోయనరసాపురానికి చెందిన ముర్రం కోటేశు... తన బంధువు కుమారుడైన కణితి నాగరాజు(4) అనే బాలుడిని పత్తి చేను వద్ద గొడ్డలితో నరికి చంపాడు. ఇది చూసిన మరో బాలుడు గ్రామంలో చెప్పడంతో విషయం వెలుగులోకి వచ్చింది. ఈ హత్యకు గల కారణాలు తెలియాల్సి ఉంది. నిందితుడు, హత్యకు గురైన బాలుడు ఇద్దరూ దుమ్ముగూడెం మండలం కోయనరసాపురానికి చెందిన ఆదివాసీలే. కాగా కొన్నేళ్ల క్రితం కోటేశు, నాగరాజు తండ్రి కుటుంబాలు పోడు వ్యవసాయం కోసం మద్దిమడుగు ప్రాంతానికి వలస వెళ్లాయి. ఈ రెండు కుటుంబాల మధ్య అప్పుడప్పుడు గొడవలు జరగడం, పెద్ద మనుషులు రాజీ చేయడం వంటి ఘటనలు జరిగినట్లు తెలుస్తోంది. ఇదిలా ఉండగా 25ఏళ్ల కోటేశు మానసిక పరిస్థితి బాగాలేదనే ప్రచారం కూడా జరుగుతోంది. ఎటపాక పోలీసులు ఘటనా స్థలానికి వెళ్లినట్లు తెలుస్తోంది. ఈ ఘటన మారుమూల అటవీగ్రామంలో జరగడంతో పూర్తి వివరాలు తెలియరాలేదు.

‘ఆపరేషన్ స్మైల్’ను విజయవంతం చేయాలి

ఉమెన్ సేఫ్టీ వింగ్ డీఐజీ రెమా రాజేశ్వరి



వీడియోకాన్ఫరెన్సులో జిల్లా అధికారులు

ఖమ్మం క్రైం, డిసెంబరు 30 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రవ్యాప్తంగా బాలకార్మికులు, తప్పిపోయిన పిల్లలను గుర్తించడం, అక్రమ రవాణకు గురైన చిన్నారులను రక్షించి వారికి పునరావాసం కలిపించేందుకు చేపడుతున్న ఆపరేషన్ స్మైల్ 11 కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని ఉమెన్ సేఫ్టీ వింగ్ డీఐజీ రెమా రాజేశ్వరి అన్నారు. 2025 జనవరి 1నుంచి 31వరకు నిర్వహించే పదకొండవ ఆపరేషన్ స్మైల్ కార్యక్రమంలో భాగంగా జిల్లాల పోలీసు, మహిళా అభివృద్ధి, శిశు సంక్షేమం, కార్మిక, విద్య, ఆరోగ్యశాఖలు, చైల్డ్ ప్రొటెక్షన్ యూనిట్, ఎన్‌జీవో అధికారులతో సోమవారం వీడియో కాన్ఫరెన్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఉమెన్ సేఫ్టీ వింగ్ డీఐజీ రెమా రాజేశ్వరి మాట్లాడుతూ బాలకార్మికులు, చిన్నారులు దుర్భరస్థితిలో ఉండే ప్రాంతాలను తెలుసుకుని వాటిని బ్లాక్‌స్పాట్‌లుగా గుర్తించి చిన్నారులను విముక్తి కలిగించాలన్నారు. ప్రధానంగా రైల్వేస్టేషన్లు, బస్‌స్టేషన్లు, ట్రాఫిక్ కూడళ్లు, మెకానిక్ షాపులు, ఇటుక బట్టీలు, టీస్టాళ్లు, దుకాణాలపై ప్రత్యేక దృష్టిసారించాలన్నారు. ఆపరేషన్ స్మైల్‌లో చైల్డ్ ట్రాక్ పోర్టల్, ముఖ కవళికలను గుర్తించే దర్పణ్ సాంకేతిక పరిజ్ఞానాన్ని ఉపయోగించడం ద్వారా సత్ఫలితాలు వచ్చాయన్నారు. అనేక మంది తప్పిపోయిన పిల్లలను దర్పణ్ అప్లికేషన్ సాయంతో గుర్తించి తల్లిదండ్రులకు అప్పగించాలన్నారు. అనంతరం ఏడీసీపీ నరేష్‌కుమార్ మాట్లాడుతూ పిల్లలను అక్రమంగా తరలించేవారిపై పోలీసులు ప్రత్యేక నిఘా పెట్టారని, పోలీసు కమిషనర్ సునీల్‌దత్ ఆధ్వర్యంలో చిన్నారులను రక్షించేందుకు ఒక్కోక్క డివిజన్‌లో ఒక సబ్ ఇన్‌స్పెక్టర్, ఇద్దరు ఏఎస్‌ఐలు, ఇద్దరు కానిస్టేబుళ్లతో కూడిన ఐదుగురు సభ్యులతో కూడిన బృందాలు తనిఖీ చేస్తున్నట్టు తెలిపారు. మైనర్లను ఇంటి పనిలో పెట్టుకుంటే చర్యలు తప్పవన్నారు.

ముక్కోటి ఉత్సవాలకు ముస్తాబైన పర్ణశాల

నేడు మత్స్యావతారంలో రామయ్య

దుమ్ముగూడెం డిసెంబరు 30 (ఆంధ్రజ్యోతి): మంగళవారం నుంచి ప్రారంభం కానున్న శ్రీ వైకుంఠ ఏకాదశి మహోత్సవాలకు పర్ణశాల రామాలయంలో ఏర్పాట్లు పూర్తి కావొచ్చాయి. ఆలయ ప్రాంగణం సర్వాంగ సుందరంగా ముస్తాబైంది. చలువ పందిళ్లు, క్లాత్ డెకరేషన్ పనులు పూర్తయ్యాయి. తొమ్మిది రోజుల పాటు నిర్వహించనున్న అలంకార సేవల కోసం వేదికను ప్రత్యేకంగా అలంకరించారు. విద్యుద్దీపాలంకరణ పనులు జరుగుతుండగా మంగళవారం సాయంత్రానికి పూర్తికానుంది. స్వామివారి అలంకారం భక్తులకు ప్రత్యేకంగా కనిపించేలా ఈ ఏడాది భద్రాచలం తరహాలో ప్రత్యేక ఏర్పాట్లు చేపట్టినట్లు ఆలయ ఇన్‌చార్జి అనిల్ తెలిపారు. ఈనెల 31న మొదటి అలంకారం మత్స్యావతారంలో పర్ణశాల రామయ్య దర్శనమివ్వనున్నారు.త



గిరిజన మ్యూజియాన్ని విద్యుద్దీపాలతో అలంకరించాలి

- ఐటీడీఏ పీవో బి.రాహుల్

భద్రాచలం, డిసెంబరు 30 (ఆంధ్రజ్యోతి): ముక్కోటి ఏకాదశి సమీపిస్తున్నందున భద్రాచలం ఐటీడీఏ ఆవరణలోని గిరిజన మ్యూజియాన్ని విద్యుద్దీపాలతో అలంకరించాలని భద్రాచలం ఐటీడీఏ పీవో బి.రాహుల్ అన్నారు. భద్రాచలంలో సోమవారం పీవో గిరిజన మ్యూజియాన్ని సందర్శించి జరుగుతున్న పనులను పరిశీలించారు. అనంతరం పీవో రాహుల్ మాట్లాడుతూ ముక్కోటికి వచ్చే భక్తులు గిరిజన మ్యూజియం సందర్శించేలా స్వాగత బోర్డులను పట్టణంలో భక్తులు తిరిగే ప్రాంతాల్లో ఏర్పాటు చేయాలన్నారు. మ్యూజియంలో కూడా పాతకాలపు వస్తువులు మార్పులు చేర్పులు ఏమైనా ఉంటే వెంటనే చేపట్టి పూర్తిచేయాలని ఆదేశించారు. సెల్ఫీ పాయింట్‌ను పూర్తి చేయాలన్నారు. విద్యుత్తు అలంకరణ, బోటు షికారు, గిరిజన సంప్రదాయాలు, క్రీడా స్థలాల్లో పనులను పూర్తి చేయాలని ఆదేశించారు.

ప్రత్యేక శ్రద్ధ వహించాలి: పీవో

దట్టమైన పొగమంచు కమ్ముకుంటున్నందున గిరిజన సంక్షేమ పాఠశాలల్లో చదివే గిరిజన విద్యార్థుల పట్ల వార్డెన్, హెచ్‌ఎంలు ప్రత్యేక శ్రద్ధ తీసుకొని పిల్లలు బయటకు వచ్చేటప్పుడు జాగ్రత్తలు పాటించాలని పీవో రాహుల్ వార్డెన్‌లు, ప్రధానోపాధ్యాయులను ఆదేశించారు. సోమవారం గిరిజన దర్బారుకు వచ్చిన గిరిజనుల వద్ద నుంచి దరఖాస్తులు స్వీకరించిన అనంతరం పీవో మాట్లాడుతూ చలికాలం దృష్ట్యా విద్యార్థుల ఆరోగ్యం, జాగ్రత్తలపై ప్రత్యేక దృష్టి నిలపాలని ఆదేశించారు.

న్యూ ఇయర్ వేడుకలు ప్రశాంతంగా జరుపుకోవాలి

- పోలీస్ కమిషనర్ సునీల్‌దత్

ఖమ్మం క్రైం, డిసెంబరు 30 (ఆంధ్రజ్యోతి): నూతన సంవత్సర వేడుకల్లో అవాంఛనీయ సంఘటనలు జరగకుండా పోలీసుశాఖ పటిష్ఠమైన భద్రత ఏర్పాట్లు చేయడం జరిగిందని పోలీసు కమిషనర్ సునీల్‌దత్ సోమవారం ఒకప్రకటనలో తెలిపారు. నూతన సంవత్సరం సందర్భంగా హార్దిక శుభాకాంక్షలు తెలిపారు. ఖమ్మం కమిషనరేట్‌లో శాంతిభద్రతల పరిరక్షణలో భాగంగా సున్నితమైన ప్రాంతాలలో పోలీసు పికెట్లతో పాటు మతపరమైన ప్రార్థనాస్థలాలు, ప్రధాన రహదారులు, సినిమా థియేటర్లు, లకారం ట్యాంక్ బండ్, వెలుగుమట్ల అర్బన్‌పార్కు తదితర పబ్లిక్ పార్కుల్లో పోలీసు పెట్రోలింగ్ ఏర్పాటుచేస్తున్నట్టు తెలిపారు. ముఖ్యంగా యువత ర్యాష్ డ్రైవింగ్, సెల్‌ఫోన్ డ్రైవింగ్, రాంగ్‌సైడ్ డ్రైవింగ్, ట్రిపుల్ రైడింగ్ తగ్గించేందుకు ప్రధన రహదారులపై వెహికల్ చెకింగ్ నిర్వదిహించాలని బాణసంచా పేల్చడాన్ని నిషధ్రించలాని పోలీసు అధికారులను ఆదేశించినట్టు తెలిపారు.

మైనర్ పిల్లలకు బైక్, కార్లను ఇస్తే ఆయా వాహనాలను నిర్లక్ష్యంగా లేక మద్యం మత్తు పదార్థాలు సేవించి నడపడం వల్ల ప్రమాదం జరిగే అవకాశం ఉంది కాబట్టి ఈ విషయంలో తల్లిదండ్రులు అప్రమత్తతో ఉండాలన్నారు. ప్రత్యకంగా డ్రంక్ అండ్ డ్రైవ్ తనిఖీలుతో పాటు ప్రమాదకరంగావాహనాలు నడిపేవారి కోసం ప్రత్యేక పోలీసు బృందాలను కూడా ఏర్పాటు చేయడం జరుగుతుందన్నారు. 31వ తేదీ అర్ధరాత్రి ఒంటి గంట తర్వాత ఎవరైన రోడ్లపై అవనసరంగా సంచరిస్తూ ఉండే వారిపై న్యూసెన్సు కేసు బుక్‌చేసి చట్టపరంగా చర్యలు తీసుకుంటామన్నారు. వేడుకలను అర్ధరాత్రి ఒంటిగంటలోపు పూర్తిచేసుకుని ఇళ్లకు వెళ్లాలని కోరారు. అత్యవసర సమయంలో డయల్ 100కు ఫోన్‌చేయాలని సూచించారు.

సాగు సంబురం

ఖమ్మం, డిసెంబరు 30(ఆంధ్రజ్యోతిప్రతినిధి): రైతులకు ఈ సంవత్సరం కాలం కలిసొచ్చింది. ఆశాజనకంగా వర్షాలు పడడం, సాగర్ ఆయకట్టు నీరు విడుదల కావడంతో జిల్లా రైతులకు సాగు సంతోషాన్నిచ్చింది. పంటల దిగుబడులు పెరగడతో పాటు రాష్ట్ర ప్రభుత్వం సన్న ధాన్యం పండించిన రైతులకు క్వింటాకు రూ.500బోనస్ అందించడంతో రైతులు అదనపు ఆదాయాన్ని పొందారు. ఇక ప్రభుత్వం చేసిన రుణమాఫీ రైతులకు వరంగా మారింది. వ్యవసాయశాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు ప్రాతినిధ్యం వహిస్తున్న ఖమ్మం జిల్లాలో ఈసారి పంటలు ఆశాజనకంగానే పండాయి. పత్తి, ధాన్యం వంటి పంటలు మద్దతు ధర లభించగా మిర్చి వంటి వాణిజ్య పంటకు కొంత ధర తగ్గింది. ఆయిల్‌పామ్‌కు రికార్డుస్థాయిలో ధర పెరగడంతో జిల్లా రైతుల చూపు ఆయిల్‌పామ్ సాగుపైపడింది.

వానకాలంలో సాగు ఇలా..

వానాకాలం సీజన్‌లో సాగర్ నీరు సకాలంలో విడుదల కావడంతో 2,88,250 ఎకరాల్లో రైతులు వరిసాగు చేశారు. మొక్కజొన్న 2,775 ఎకరాలు, పత్తి 2,3849 ఎకరాలు, మిర్చి 60వేల ఎకరాలు చెరకు 270 ఎకరాలు, పిల్లిపెసర 341ఎకరాలు, పచ్చపెసర 33వేల ఎకరాలు, మినుము 155 ఎకరాలు, కంది 585ఎకరాల్లో సాగు చేశారు. జిల్లాలో 344కొనుగోలు కేంద్రాలు ఏర్పాటుచేసి ఇప్పటి వరకు 2లక్షల మె.ట ధాన్యం కొనుగోలు చేశారు. సన్నధాన్యానికి తొలిసారి ప్రభుత్వం క్వింటాకు రూ.500బోనస్ అందించడంతో రైతులకు అదనపు ఆదాయం లభించింది. జిల్లా రైతులు ఇప్పటికే బోనస్ రూపంలో రూ.50కోట్లపైగా అదనపు ప్రయోజనం పొందారు. జిల్లాలో పత్తి కూడా ఈసారి ఆశాజనకంగానే పండింది. సీసీఐ ఇప్పటికే 3.50లక్షల క్వింటాళ్ల పత్తి కొనుగోలు చేయగా వ్యవసాయ మార్కెట్ల ద్వారా మరో 4.78లక్షల క్వింటాళ్లు కొనుగోలు చేశారు. అయితే ఈ ఏడాది మిర్చి రైతులకు కొంత నిరాశను మిగిల్చిందనే చెప్పాలి. గత సంవత్సరం తామరపురుగు విజృంభించడంతో తీవ్రంగా నష్టపోవడంతో ఈ సంవత్సరం జిల్లాలో మిర్చి సాగు కొంత తగ్గింది. ఇదే సమయంలో మార్కెట్‌లో మిర్చి ధర గతం కంటే తక్కువగా ఉండడంతో రైతులు నష్టపోయారు.

ఈ ఏడాది జిల్లాలో 60వేల ఎకరాల్లో మిర్చి సాగు చేశారు. గతేడాది క్వింటాకు ధర రూ.20వేలు ఉండగా ఈ ఏడాది రూ16వేల వరకు మాత్రమే పలుకుతోంది.

వర్షాలు, వరదలతో నష్టం..

ఇక వానాకాలం సీజన్ ప్రారంభంలో జిల్లాలో భారీ వర్షాలు, వరదల కారణంగా రైతులు తీవ్రంగా నష్టపోయారు. పాలేరు, ఖమ్మం, మధిర నియోజకవర్గాలతో పాటు వైరా నియోజకవర్గంలోనూ వరదలు ముంచెత్తాయి. గతంలో ఎన్నడూలేని విధంగా మున్నేరు పాలేరు, ఆకేరు పరివాహకప్రాంతంలో అతిభారీవర్షాలు కురవడంతో పత్తి, మిర్చి, మొక్కజొన్న, వరి, తదితర పంటలకు తీవ్ర నష్టం వాటిల్లింది. చెరువులు, రోడ్లకు గండ్లు పడడం, వరద ముంచెత్తడంతో వేలాది ఎకరాల్లో ఇసుక మేటలు వేశాయి. ఆయా భూముల రైతులు సర్వం కోల్పోయారు. అధికారులు మొత్తం 27,407ఎకరాల్లో పంటనష్టం జరిగినట్లు తేల్చారు. దెబ్బతిన్న పంటలకు ప్రభుత్వం ఎకరాకు రూ.10వేల చొప్పున జిల్లా రైతులకు రూ.28.40కోట్ల పరిహారం అందించింది. అయితే పొలాల్లో ఇసుక మేటలు వేసిన రైతులకు ఈ పరిహారం ఏ మూలకు సరిపోలేదు. ఆయా రైతులు ఇంకా కోలుకోలేని పరిస్థితిలోనే ఉన్నారు. సీఎం రేవంత్‌రెడ్డి, కేంద్ర వ్యవసాయశాఖ మంత్రి శివరాజ్ సింగ్‌చౌమాన్‌తో పాటు కేంద్ర బృందం కూడా జిల్లాలో వరద నష్టాన్ని పరిశీలించి వెళ్లారు. మొత్తంగా 2024లో తొలుత కొంత నష్టం కలిగినా ఈ సంవత్సరం సాగు ఆశాజనకంగానే ఉందని చెప్పాలి.

యాసంగిలోనూ సాగు జోరు..

నాగార్జునసాగర్‌లో నీటినిలువ ఉండడంతో యాసంగికి కూడా కృష్ణాజలాలు విడుదల చేశారు. దీంతో సాగర్ ఆయకట్టు కింద పంటల సాగు జోరుగా సాగుతోంది. యాసంగిలో 1లక్షా 7వేల 65ఎకరాల్లో సాగు లక్ష్యంగా పెట్టుకోగా ఇప్పటికే 10,799 ఎకరాల్లో వరి నాట్లు వేశారు. మొక్కజొన్న 50,399 ఎకరాలు, వేరుశనగ 372, మినుము 84 ఎకరాలు, పెసర 1,464 ఎకరాలు, శనగ 27ఎకరాలు, జొన్న 43ఎకరాల్లో ఆగు లక్ష్యంగా పెట్టుకున్నారు. మొక్కజొన్న జిల్లాలో విస్తతంగా సాగవుతోంది.

ఆయిల్‌పామ్‌పై ఆసక్తి..

ఉమ్మడి జిల్లాలో ఈ ఏడాది రైతులు ఆయిల్‌పామ్ సాగుపై ఆసక్తి చూపారు. పత్తి, మిర్చి, వరి వంటి పంటలతో ఆశించిన స్థాయిలో ఆదాయం లభించకపోవడంతో క్రమంగా ఆయిల్‌పామ్‌పై ఆసక్తి చూపుతున్నారు. మంత్రి తుమ్మల నాగేశ్వరరావు చొరవతోపాటు ప్రభుత్వం ఇస్తున్న ప్రోత్సాహకాలతో ఈ ఏడాది ఆయిల్‌పామ్ ఇప్పటికే 5వేల ఎకరాల్లో వేశారు. జిల్లాలో మొత్తం 30వేల ఎకరాల్లో ఆయిల్‌పామ్ సాగవుతోంది. ప్రస్తుతం ఆయిల్‌పామ్ టన్ను గెలల ధర రూ.20,400 పలుకుతోంది.

ఊరటనిచ్చిన రైతు రుణమాఫీ..

ప్రభుత్వం చేసిన రుణమాఫీ జిల్లా రైతులకు భారీ ఊరటనిచ్చింది. నాలుగు విడతలుగా 1,31,723మంది రైతులకు రూ.908కోట్ల 75లక్షల 95వేల 87రూపాయల రుణమాఫీ జరిగింది. జిల్లాలో ఇంత పెద్దమొత్తంలో రైతురుణమాఫీ జరగడం ఇదే తొలిసారి. ఇంకా రెండులక్షలపైన రుణాలు ఉన్న రైతులకు, ఆధార్‌కార్డు లింక్ అయి సర్వేపూర్తయిన మరికొందరు రైతులకు రుణమాఫీ అందించాల్సి ఉంది.

భద్రాచలం ఏఎస్పీగా విక్రాంత్‌కుమార్

భద్రాచలం, డిసెంబరు 30 (ఆంధ్రజ్యోతి): భద్రాచలం అసిస్టెంట్ సూపరింటెండెంట్ ఆఫ్ పోలీస్‌గా (ఏఎస్‌పీ) విక్రాంత్‌కుమార్ సింగ్‌ను నియమిస్తూ రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతికుమారి ఉత్తర్వులు జారీ చేశారు. 2022 ఐపీఎస్ బ్యాచ్‌కు చెందిన విక్రాంత్‌కుమార్ సింగ్‌ను భద్రాచలం ఏఎస్‌పీగా నియమించారు. ప్రస్తుతం ఆయన గ్రేహౌండ్స్‌లో విధులు నిర్వహిస్తుండగా ఇప్పటి వరకు ఇక్కడ బాధ్యతలు నిర్వహించిన అంకిత్‌కుమార్‌ను బదిలీచేశారు. వాస్తవానికి అక్టోబరు 3 నుంచి ప్రత్యేక శిక్షణ కోసం అంకిత్ కుమార్ వెళ్లగా ఆయన స్థానంలో మణుగూరు డీఎస్పీ రవీంద్రరెడ్డి ఇన్‌చార్జి ఏఎస్‌పీగా అదనపు బాధ్యతలు నిర్వహిస్తున్నారు.

యూపీ వాసి..

ఉత్తరప్రదేశ్ రాష్ట్రంలోని గజియాబాద్ విక్రాంత్‌కుమార్‌సింగ్ స్వస్థలం. 2022లో ఐపీఎస్‌కు ఎంపికయ్యారు. ఆయన తండ్రి మహేందర్‌సింగ్ జిల్లా న్యాయమూర్తిగా పనిచేసి ఉద్యోగ విరమణ చేయగా తల్లి మంజులాదేవి గృహిణిగా బాధ్యతలు నిర్వహిస్తున్నారు. విక్రాంత్‌కుమార్ సింగ్ సోదరుడు ప్రశాంత్‌సింగ్ బనారస్ సివిల్ జడ్జిగా విధులు నిర్వహిస్తున్నారు. బీటెక్ పూర్తి కాగానే 2015లో విక్రాంత్‌సింగ్ ఎస్‌బీఐ పీవోగా ఎంపికయ్యారు. 2016 నుంచి రెండుసార్లు సివిల్స్‌కు ప్రయత్నించారు. 2022లో సివిల్స్‌లో ఉత్తీర్ణత సాధించి ఐపీఎస్‌కు ఎంపికయ్యారు.

జిల్లాలో పనిచేసిన అనుభవం

ఐపీఎస్‌గా ఎంపికైన అనంతరం జాతీయ పోలీసు అకాడమీలో శిక్షణ పొందిన తరువాత ఈ ఏడాది జనవరి 8న భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలో ప్రొబేషనరీ విధులు నిర్వహించేందుకు వచ్చారు. అప్పటినుంచి మార్చి మూడో తేదీ వరకు వివిధ హోదాల్లో విధులు నిర్వహించారు. మార్చి 4నుంచి మే 25 వరకు విక్రాంత్‌కుమార్ సింగ్ లక్ష్మీదేవిపల్లి ఎస్‌హెచ్‌వోగా బాధ్యతలు నిర్వహించారు. అనంతరం ప్రొబేషనరీ కాలపరిమితి పూర్తి చేసుకొని జూన్‌లో జాతీయ పోలీసు అకాడమీకి వెళ్లి శిక్షణ పొందారు. అనంతరం గ్రేహౌండ్స్‌లో ప్రస్తుతం బాధ్యతలు నిర్వహిస్తున్నారు.

ఐసీఏఆర్ శాస్త్రవేత్తగా పోలెపొంగు శ్రీలత

తిరుమలాయపాలెం, డిసెంబరు 30 (ఆంధ్రజ్యోతి): మండలంలోని సుబ్లేడు గ్రామానికి చెందిన నిరుపేద యువతి ఇండియన్ కౌన్సిల్ ఆఫ్ అగ్రికల్చర్ రీసెర్చ్ (ఐసీఏఆర్) శాస్త్రవేత్తగా ఎంపికయ్యారు. సుబ్లేడు గ్రామానికి చెందిన పోలెపొంగు జగ్గయ్య, కృష్ణకుమారి దంపతుల కుమార్తె శ్రీలత చిన్ననాటినుంచి చదువులో చురుకు ఉండేది. చదవుపట్ల మక్కువ, తల్లిదండ్రుల ప్రోత్సాహంతో చదువులో రాణిస్తోంది. బీఎస్సీ అగ్రికల్చర్ ప్రొఫెసర్ జయశంకర్ కళాశాలలో చదివింది. ఎంఎస్సీ ప్లాంట్ పాథాలజీ మహాత్మాపూలే కృషి విద్యాపీఠ్, మహారాష్ట్రలో చదివారు. పీహెచ్‌డీ ప్లాంట్ పాథాలజీ రంగారెడ్డి నగర్, హైదరాబాదు ప్రొఫెసర్ జయశంకర్ కళాశాలలో చదివింది. ఐసీఏఆర్ నోటిఫికేషన్‌లో ఆలిండియా ర్యాంకు తెలంగాణ నుంచి ఈమె ఒక్కతే సాధించింది. సుబ్లేడు గ్రామ కీర్తిని జాతీయస్థాయిలో తీసుకెళ్లిన శ్రీలతను గ్రామస్థులు అభినందించారు.

ప్రజల నమ్మకాన్ని నిలబెడతా

(3వ పేజీ తరువాయి)

చేయబోతున్నామన్నారు. ఖమ్మం మెడికల్ కాలేజీ సమీపంలో పదెకరాల్లో సింథటిక్ స్టేడియం నిర్మించనున్నట్లు తుమ్మల ప్రకటించారు. సీతారామ ప్రాజెక్టు పనులను సత్వరం పూర్తి చేసేలా కృషి చేస్తానన్నారు. ఖమ్మం ఖిల్లాకు రోప్‌వే నిర్మాణం, నెహ్రూజూపార్క్ తరహాలో వెలుగుమట్ల అటవీపార్కు అభివృద్ధి చేస్తామన్నారు. ఖమ్మంను ఎడ్యుకేషన్ హబ్‌గా మార్చేందుకు కృషి చేస్తున్నట్లు తెలిపారు. ఈ క్రమంలో జనవరిలో ఖమ్మం మెడికల్ కాలేజీ శంకుస్థాపన చేస్తున్నామన్నారు. అలాగే స్వామినారాయణ ఇంటర్నేషనల్ స్కూల్, రాష్ట్ర ప్రభుత్వ ఇంటిగ్రేటెడ్ పాఠశాలలు, తదితర విద్యాసంస్థలు నెలకొల్పబోతున్నామని తెలిపారు కొత్తగూడెం ఇంజనీరింగ్ కాలేజీని మైనింగ్ యూనివర్శిటీగా తీర్చిదిద్దేందుకు ప్రభుత్వం ప్రయత్నిస్తోందన్నారు. ఖమ్మం నగరంలో అండర్‌గ్రౌండ్ డ్రెయినేజీ వ్యవస్థ, మున్నేరు వరద నివారణకు కాంక్రీట్ వాల్ నిర్మాణం చేపడుతున్నట్లు తెలిపారు. అదేవిధంగా రఘునాథపాలెం మండలం మంచుకొండ ఎత్తిపోతల పథకానికి సంక్రాంతి రోజు శంకుస్థాపన చేయబోతున్నామన్నారు.

గోదావరి జలమార్గం అభివృద్ధికి కృషి

రాష్ట్రంలో కాళేశ్వరం నుంచి ఏపీలోని పోలవరం వరకు గోదావరిని జలమార్గంగా అభివృద్ధి చేయాల్సిన అవసరం ఉందని, ఇందుకోసం రాష్ట్ర ప్రభుత్వం కృషిచేస్తోందని వ్యవసాయశాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు వెల్లడించారు. గోదావరి జలమార్గాన్ని సముద్రానికి అనుసంధానం చేస్తే తక్కువ ఖర్చుతో సరుకు రవాణా చేసుకునే అవకాశం ఉంటుందన్నారు. రాష్ట్ర ప్రభుత్వం ఈ ప్రతిపాదనలను కేంద్రం దృష్టికి తీసుకెళుతుందని వెల్లడించారు. కొత్తగూడెం ఎయిర్‌పోర్టు ఏర్పాటు విషయంపై సీఎం రేవంత్ రెడ్డితో కేంద్ర పౌర విమానయానశాఖ మంత్రి రామ్మోహన్‌నాయుడుకు లేఖ రాయించామని, త్వరలో కేంద్రమంత్రితో మాట్లాడి కొత్తగూడెం ఎయిర్‌పోర్టు మంజూరుకు చర్యలు తీసుకుంటామన్నారు. ఖమ్మం జిల్లాలో జాతీయ రహదారులు వేగంగా అభివృద్ధి చెందుతున్నాయని తెలిపారు. భద్రాచలానికి ఒడిశా నుంచి రైలుమార్గం మంజూరైందని, అయితే ప్రస్తుతం పాండురంగాపురం నుంచి సారపాక వరకు రైలుమార్గం నిర్మించాలని కేంద్ర రైల్వేశాఖ మంత్రిని కోరామని తెలిపారు తద్వారా భద్రాచలం దక్షిణ అయోధ్యగా అభివృద్ధి చెందుతుందన్నారు. కొత్త ఏడాది కానుకగా జనవరిలో రైతులకు రైతుభరోసా మంజూరు చేయబోతున్నామని మంత్రి తుమ్మల తెలిపారు. విలేకరుల సమావేశంలో జిల్లా కాంగ్రెస్ అధ్యక్షుడు పువ్వాళ్ల దుర్గాప్రసాద్, కార్పొరేటర్ కమర్తపుమురళి, వీవీపాలెం సొసైటీ అధ్యక్షుడు రావూరి సైదుబాబు తదితరులు పాల్గొన్నారు.

శోభాయమానం.. భద్రాద్రి క్షేత్రం

(3వ పేజీ తరువాయి)

దేవస్థానం ఈవో ఎల్.రమాదేవి అందజేయనున్నారు. తరువాత ప్రత్యేక ఆరాధనలో ముందుగా వేదాలు, ఇతిహాసాలు, పురాణం, భద్రాద్రి క్షేత్ర మహత్మ్యం, దివ్య ప్రబంధంలో అధ్యయనం ప్రారంభంకానున్నాయి. దీనినే సంప్రదాయ బద్ధంగా తొలక్కం అంటారు. ఈ సందర్భంగా గంటపాటు నాళాయర దివ్య ప్రంబంధంలోని పద్యాలను సేవాకాలం చేస్తారు.

నేటినుంచి దశావతారాలు

వైకుంఠ ఏకాదశి అధ్యయనోత్సవాల్లో భాగంగా శ్రీసీతారామచంద్రస్వామి దేవస్థానం ఆధ్వర్యంలో మంగళవారం నుంచి దశావతారాలు ప్రారంభం కానున్నాయి. తొలి రోజున మత్స్యవతారంలో స్వామి వారు భక్తులకు దర్శనమివ్వనున్నారు. జనవరి ఒకటిన కూర్మావతారంలో, రెండున వరాహావతారంలో, 3న నరసింహావతారంలో, 4న వామనావతారంలో, 5న పరశురామ అవతారంలో, 6న శ్రీరామవతారంలో, 7న బలరామావతారంలో, 8న శ్రీకృష్ణ అవతారంలో స్వామివారు భక్తులకు దర్శనమివ్వనున్నారు. ఈ సందర్భంగా ప్రతిరోజు స్వామివారిని అందంగా అలంకరించి కల్యాణ మండపంలోని ప్రత్యేక వేదిక వద్దకు తీసుకొచ్చి భక్తుల దర్శనార్థం ఉంచి అనంతరం తిరువీధి సేవ నిర్వహిస్తారు.

జనవరి 9 నుంచి 20వరకు రాపత్తు సేవలు

జనవరి 9 నుంచి 20వరకు రాపత్తు సేవలను నిర్వహించనున్నారు. తొలుత ఏఎస్పీ కార్యాలయంలో నిర్వహణతో ఈ రాపత్తోత్సవాలకు శ్రీకారం చుట్టనున్నారు. జనవరి 21నుంచి 23 వరకు విలాసోత్సవాలు నిర్వహించనున్నారు.



ర్యాంపు సిద్ధం చేస్తున్న దృశ్యం

10 వరకు నిత్య కల్యాణాల నిలిపివేత

వైకుంఠ ఏకాదశి అధ్యయనోత్సవాల్లో భాగంగా శ్రీసీతారామచంద్రస్వామి తొలి పదిరోజులు దశావతారాల్లో భక్తులకు దర్శనమివ్వనుండటంతో మంగళవారం నుంచి స్వామివారికి ప్రతి నిత్యం నిర్వహించే నిత్య కల్యాణాలను జనవరి 10వరకు నిలిపివేయనున్నారు. 11నుంచి నిత్య కల్యాణాలు పునః ప్రారంభమవుతాయి.

26న విశ్వరూప సేవ

జనవరి 26న భద్రాద్రి దేవస్థానం ఆధ్వర్యంలో రామాలయ ప్రాంగణంలో విశ్వరూప సేవ (సర్వదేవతా అలంకారం) నిర్వహించనున్నారు. ఈ సందర్భంగా ఆలయంలోని 108 దేవతామూర్తులను ఒక చోట పేర్చి ప్రత్యేక పూజా కార్యక్రమాలను నిర్వహించనున్నారు. కలియుగ వైకుంఠంలా సాగే ఈ కార్యక్రమం భక్తులను ఎంతో ఆకట్టుకోనుంది. ఆ రోజు స్వామివారి నివేదనకు చేసే కదంబం ప్రసాదం ఒక ప్రత్యేకతగా చెప్పవచ్చు.

క్రైం సమాచారం

కోడిపందాల స్థావరంపై పోలీసుల దాడి

పినపాక, డిసెంబరు 30 (ఆంధ్రజ్యోతి): కోడి పందాల స్థావరంపై ఈబయ్యారం పోలీసులు కొరడా ఝుళిపించారు. పినపాక మండలం తోగూడెం అటవీ ప్రాంతంలో డీఎస్పీ రవీందర్ రెడ్డి, సీఐ వెంకటేశ్వర రావు ఆదేశాల మేరకు సోమవారం ఎస్‌ఐ రాజ్‌కుమార్ దాడులు నిర్వహించారు. ఈ దాడుల్లో కోడిపందాలు నిర్వహిస్తున్న 10మందిని అదుపులోకి తీసుకున్నారు. వారి వద్ద నుంచి రూ.1500తోపాటు తొమ్మిది ద్విచక్రవాహనాలు, కోడిపుంజులు స్వాధీనం చేసుకున్నట్లు ఎస్‌ఐ వెల్లడించారు. ఈ సందర్భంగా ఎస్‌ఐ రాజ్‌కుమార్ మాట్లాడుతూ పేకాట, కోడిపందాలు ఎక్కడ ఆడిన ఉపేక్షించేది లేదని హెచ్చరించారు. వీటి వల్ల కుటుంబాలు ఆర్థికంగా చితికిపోతాయని, గ్రామాల్లో ఎక్కడ పేకాట, కోడిపందాలు ఆడిన పోలీసులకు సమాచారం అందిస్తే వారిని పట్టుకుని కేసులు నమోదు చేస్తామని తెలిపారు. పేకాట, కోడిపందాలు ఆడకుండ గ్రామస్థులు, మహిళలు, పోలీసులకు సహకరించాలని కోరారు. పందాలు ఆడుతున్న విషయాన్ని పోలీసులకు తెలియచేస్తే వారి పేర్లను గోప్యంగా ఉంచుతామని వెల్లడించారు. ఈ కార్యక్రమంలో డీఎస్పీ, ఎస్‌ఐ, పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

రియల్ వెంచర్‌లో యాజమాన్యం మధ్య గొడవ

కొణిజర్ల, డిసెంబరు30 (ఆంధ్రజ్యోతి): కొణిజర్ల సమీపంలోని ప్రధానరహదారి పక్కన ఓ రియల్ ఎస్టేట్ వెంచర్ ఉంది. సుమారు పది సంవత్సరాల క్రితం నుంచి ఆ వెంచర్‌ను అభివృద్ధి చేసుకుంటున్నారు. వెంచర్‌లో భాగస్వాముల మధ్య లాభాల పంపకమో ఇతర కారణాల వల్లనో వివాదం ముదురుతోంది. అందులో కిషోర్ అనే వ్యక్తి గిరి అనే భాగస్వామి మీదతనతో పాటు మరికొంతమందిని వెంచర్‌లోని ఆఫీస్ నుంచి బయటకు సిబ్బందితో వెళ్లగొట్టించారని, ఆ కార్యాలయం తమదేనని ఆదివారం పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు.

గిరి కూడా సోమవారం కిషోర్, శరత్, మరికొంత మంది తమ కార్యాలయానికి వచ్చి దౌర్జన్యం చేశారని, దీనిపై చర్యలు తీసుకోవాలని ఫిర్యాదు చేసిన్నట్లు ఎస్‌ఐ తెలిపారు. సోమవారం వెంచర్ వద్ద ఇరువురి మధ్య కొంత ఉద్రిక్తత నెలకొంది. విషయం తెలుసుకున్న ఎస్‌ఐ సూరజ్ వెంచర్ వద్దకు చేరుకొని ఇరువురిని సముదాయించి, అక్కడ ఉన్న జనాన్ని పంపించారు. ఎస్‌ఐ మాట్లాడుతూ కిషోర్, గిరి ఇరువురు ఫిర్యాదు చేశారని, విచారణ చేసి చర్యలు తీసుకుంటామని తెలిపారు. ఘర్షణ వాతావరణం సృష్టిస్తే చర్యలు తీసుకుంటామని తెలిపారు.

రాయపట్నం రేవు నుంచి ఇసుక అక్రమ రవాణా



ఇసుక నిల్వలను పరిశీలిస్తున్న ఆర్‌ఐ భానుప్రసాద్

మధిర రూరల్, డిసెంబరు 30 (ఆంధ్రజ్యోతి): మధిర మండలం రాయపట్నం ఏటి నుంచి రాత్రి సమయాల్లో ఇసుకను అక్రమంగా తరలిస్తున్నారని స్థానికులు ఆదివారం రాత్రి అధికారులకు ఫిర్యాదు చేశారు. రాత్రి 12గంటల తర్వాత మూడ్నాలుగు ట్రాక్టర్లు రాయపట్నం సమీపంలోని వైరా ఏటి నుంచి ఇసుకను తరలిస్తుండటంతో స్థానికులు చూసి రెవెన్యూ, పోలీసు అధికారులకు ఫిర్యాదు చేశారు. రాయపట్నం గ్రామంలో రైతువేదిక వద్దగల ఖాళీ స్థలంలో అక్రమార్కులు భారీగా ఇసుకను డంప్ చేసి ఉంచారు. రాత్రి సమయాల్లో ట్రాక్టర్లలో తీసుకువచ్చి ఇక్కడ నిల్వ చేసినట్లు స్థానికులు రెవెన్యూ, పోలీసు అధికారులకు ఫిర్యాదు చేశారు. దీంతో ఆర్‌ఐ భానుప్రసాద్ నిల్వ చేసిన ఇసుక డంప్‌ను సోమవారం పరిశీలించారు. అక్రమంగా ఇసుక రవాణా చేస్తే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఐదారు ట్రాక్టర్లలో రాత్రి సమయాల్లో ఇసుకను తరలిస్తున్నారని, ఇసుక అక్రమ రవాణాకు అడ్డుకట్ట వేయాలని స్థానికులు కోరుతున్నారు. లేని పక్షంలో ఆందోళన చేస్తామని హెచ్చరించారు.

గంజాయి సేవిస్తున్న వ్యక్తుల అరెస్టు

ఖమ్మం క్రైం, డిసెంబరు 30 (ఆంధ్రజ్యోతి): నగర పరిధిలో గంజాయి సేవిస్తున్న, విక్రయిస్తున్న ఎనిమిది మందిని ఆదివారం రాత్రి అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించినట్లు ఖానాపురం హవేలీ పోలీసులు సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. నగర పరిధిలోని గోపాలపురంలో ఓ దాబా సమీపంలో ఉన్న ఇంట్లో గంజాయి సేవిస్తూ, విక్రయిస్తున్నారని సమాచారం రావడంతో పోలీసులు తనిఖీలు నిర్వహించారు. ఈ తనిఖీల్లో నగరానికి చెందిన గండమాల మధు, వెలిశాల శ్రీనాథ్, కాటిని అజయ్‌కుమార్, కొల్లి నరేందర్, భుక్యా కళ్యాణ్, నాగిరెడ్డి ప్రోచిత్‌రెడ్డి, బండి గణేష్, సాయి స్వరూప్ పట్టుబడ్డారు. వారిని విచారించగా గండమాల మధు, వెలిశాల శ్రీనాథ్ ఆంధ్రప్రదేశ్‌లోని మారెడ్‌మిల్లి సమీపంలోని బోందల వీధి అనే గ్రామంలో ఇటీవల నాలుగు కిలోల గంజాయిని ఒకరి వద్ద కొనుగోలు చేసి ఖమ్మంకు తీసుకువచ్చారు. దాన్ని చిన్న చిన్న ప్యాకెట్లు గా చేసి అమ్ముతున్నట్టు పోలీసులకు తెలిపారు. దీంతో వారి వద్ద నుంచి 975గ్రాముల గంజాయిను స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేసి రిమాండ్‌కు తరలించినట్లు పోలీసులు తెలిపారు. పట్టుబడిన వారిలో కొల్లి నరేందర్, భుక్యా కళ్యాణ్‌లపై గతంలో గంజాయి కేసులు కూడా ఉన్నాయని పోలీసులు తెలిపారు.

చెల్లని చెక్కు కేసులో ఆరు నెలల జైలు

ఖమ్మం లీగల్, డిసెంబరు 30(ఆంధ్రజ్యోతి): ఏన్కూరు మండల కేంద్రానికి చెందిన అర్వపల్లి వెంకటేశ్వర్లుకు చెల్లని చెక్కు కేసులో కింది కోర్టు విధించిన ఆరు నెలల శిక్షను ఖరారుచేస్తూ ఖమ్మం నాల్గవ అదనపు జిల్లా ఫ్యామిలీకోర్టు న్యాయాధికారి ఎం.అర్చనాకుమారి సోమవారం తీర్పుచెప్పారు. తల్లాడ మండలం తల్లాడ గ్రామానికి చెందిన ఫిర్యాది బండారు విశ్వనాథం వద్ద తన వ్యాపార అవసరాల నిమిత్తం నిందితుడైన వెంకటేశ్వర్లు ఫిబ్రవరి 15 2013న రూ. ఏడు లక్షలు అప్పుగా తీసుకొని అదేరోజు ప్రాంసరీనోటు రాయించి ఇచ్చాడు. ఫిర్యాది తన అప్పును తిరిగి చెల్లించమని ఒత్తిడి చేయగా నిందితుడు ఆగస్టు 11 2024న తొమ్మిది లక్షల యాభై వేల రూపాయలకు చెక్కు జారీ చేసినాడు. ఆ చెక్కును ఫిర్యాది తన బ్యాంకు ఖాతాలో జమచేయగా చెక్కు తిరస్కరణకు గురైంది. ఫిర్యాది తన న్యాయవాది ద్వారా లీగల్ నోటీస్ జారీచేసి కోర్టులో ప్రైవేటుకేసు దాఖలుచేయగా ఖమ్మం మద్యపాన ఆబ్కారి ప్రత్యేక కోర్టు న్యాయాధికారి రాళ్లబండి శాంతిలత కేసును విచారించి నిందితుడిపై నేరం రుజువు కావడంతో ఆరు నెలలు జైలుశిక్షతో పాటు పదివేల రూపాయలు జరిమానా విధిస్తూ అక్టోబరు 30 2023 నాడు తీర్పుచెప్పారు. ఆ తీర్పుపై జిల్లా కోర్టులో నిందితుడు అప్పీల్ చేసుకోగా న్యాయాధికారి కేసును విచారించి శిక్షను ఖరారుచేస్తూ తీర్పుచెప్పారు.

రూ. 3 కోట్ల విలువైన స్థలం ఆక్రమణ

- మధిరలో వెలుగుచూసిన భూ బాగోతం
- మూడు నెలల క్రితం గిఫ్ట్ డీడ్..
- సరిపోలని రెవెన్యూ ఖాతా నెంబరు, సర్వేనెంబరులో పేర్లు
- లక్షలు చేతులు మారినట్లు ప్రచారం



ఇల్లు ఉన్నా తొలగించినట్లు చూపి రిజిస్ట్రేషన్ చేసిన స్థలం

మధిర టౌన్, డిసెంబరు30 (ఆంధ్రజ్యోతి): మధిర సబ్ రిజిస్ట్రార్ కార్యాలయంలో డబ్బులు ఇస్తే ఏదైనా జరుగుతుందనే ప్రచారం జోరుగా సాగుతోంది. మధిరలో కొందరి ఆక్రమణలో ఉన్న నాలా, హిందూ శ్మశాన వాటికకు చెందిన 2,738 గజాల స్థలం సెప్టెంబరు 20న డాక్యుమెంట్ నెం.3012-2024తో రిజిస్ట్రేషన్ అయింది. ఈ రిజిస్ట్రేషన్ వెనక కొందరి పెద్దల హస్తం ఉన్నట్లు ప్రజలు చర్చించుకుంటున్నారు.

నాలా, శ్మశాన స్థలం ఆక్రమణ

మధిర పట్టణానికి చెందిన ఓ వ్యక్తి ఆజాద్ రోడ్డు చివరలో దాదాపు 60 ఏళ్ల క్రింద కొంత స్థలాన్ని కొనుగోలు చేసి ఇంటి నెం.11-104తో స్థిర నివాసం ఏర్పాటు చేసుకున్నాడు. ఈ స్థలానికి ఉత్తరం పక్కన ప్రభుత్వ నక్షాలో 60 అడుగుల దారితో పాటు నాలా ఉంది. పడమర పక్కన పది ఎకరాల హిందూ శ్మశాన వాటికకు చెందిన స్థలం, మరో వ్యక్తికి చెందిన స్థలం ఉంది. ఈ స్థలం ఊరుకు చివరన ఉండటంతో ఎవరూ అటుగా వెళ్లే వారు కాదు. దీంతో ఆ వ్యక్తి ఈ రెండు స్థలాలను క్రమక్రమంగా ఆక్రమించుకొని తన స్వాధీనంలోకి తెచ్చుకున్నాడు. ముందు వైపు ప్రహరీ గోడ నిర్మించాడు. అనేక సంవత్సరాలుగా తన ఆధీనంలో ఉన్న స్థలానికి డాక్యుమెంట్లు సృష్టించేందుకు ప్రయత్నం చేసినా సాధ్యం కాలేదు. 30 సంవత్సరాల క్రితం ఆయన మరణించాడు. వారికి సంతానం కూడా ఎవరూ లేరు. అతడి మరణం తర్వాత అతడి భార్య స్థలానికి డాక్యుమెంట్ల కోసం అనేక ప్రయత్నాలు చేసినా సాధ్యపడలేదు. వృద్ధాప్యంలో ఉన్న ఆమె కొన్ని నెలల క్రితం తన సోదరి కుమారుల చెంతకు చేరింది. తన స్వాధీనంలో ఉన్న స్థలాన్ని తన సోదరి కుమారులకు సెప్టెంబరు 20న గిఫ్ట్ రిజిస్ట్రేషన్ చేసింది.

ఎలా సాధ్యమైంది...

తమ ఆధీనంలో ఉన్న స్థలాన్ని ఆమె ఏ డాక్యుమెంట్ ఆధారంగా రిజిస్ట్రేషన్ చేసిందనేది తెలియడం లేదు. గత ఆగస్టులో మునిపిపాలిటీలో ఆమె పేరుతో మ్యూటేషన్ చేయించడం వెనుక పక్కా ప్లాన్ ఉన్నట్టు తెలిసింది. రిజిస్ట్రేషన్ సమయంలో ఆ స్థలంలో శిథిలావస్థలో ఉన్న ఇంటిని తొలగించినట్లు, 2012లో పట్టాదారు పాస్‌పుస్తకం ఉన్నట్లు చూపారు. దానికి ఆర్డీవో ద్వారా ల్యాండ్ కన్వర్షన్ చేసిన సర్టిఫికెట్ సమర్పించారు. హద్దుల్లో ఉత్తరంలో ఉన్న ప్రభుత్వ నాలాను తన సొంత కెనాల్ గాను, పడమర వైపు ఉన్న శ్మశాన భూమి, మరో వ్యక్తికి బదులుగా నర్సరీ అని రిజిస్ట్రేషన్ చేయడం వెనుక మతలబు ఉందనిపిస్తోంది.

పాస్ పుస్తకంపై అనుమానాలు...

ల్యాండ్ కన్వర్షన్ సమయంలో చూపిన పాత పట్టాదారు పాస్‌పుస్తకం కూడా మధిర తహసీల్దార్ కార్యాలయం నుంచి ఇచ్చింది కాదని తెలుస్తోంది. అంతే కాకుండా ఆ పాస్‌పుస్తకంలో చూపిన ఖాతానెంబరులో రెవెన్యూ రికార్డు ప్రకారం ఉన్న పేరులో తేడా ఉందని, సర్వే నెంబరు అసలే లేదని సమాచారం. దీనికితోడు మునిసిపల్ రికార్డుల్లో శిథిలావస్థలో ఉన్న ఇంటికి ఎనిమిది కుంటలు స్థలం మాత్రమే ఉండగా 2,738 గజాల స్థలం ఎలా వచ్చిందని మునిసిపల్ అధికారులు సైతం ఆశ్చర్యం వ్యక్తం చేస్తున్నారు. దీనిపై తహసీల్దార్ ఆర్. రాంబాబును వివరణ కోరగా 2012లో తహసీల్దార్ కార్యాలయం జారీ చేసినట్లు ఉన్న చూపిన పాస్ పుస్తకంలో ఉన్న ఖాతా నెంబరు 337లో మరొకరు ఉన్నారని తెలిపారు. సర్వే నెంబరులో కూడా తేడా ఉందని అన్నారు. పూర్తిగా రికార్డులు తనిఖీ చేస్తామని తెలిపారు.



కార్యాలయంలో భద్రపరిచిన కుట్టు మిషన్ల సామగ్రి

మండల పరిషత్తులో కుట్టు మిషన్లు మాయం

- ఎత్తుకెళ్లిన గుర్తుతెలియని వ్యక్తులు..?
- సామగ్రి మాయంపై అనుమానాలు
- పోలీసులకు ఫిర్యాదు చేశాం: ఎంపీడీవో

అశ్వారావుపేట రూరల్, డిసెంబరు 30 (ఆంధ్రజ్యోతి): అశ్వారావుపేట మండల పరిషత్తు కార్యాలయంలో పేద మైనార్టీ మహిళలకు అందించేందుకు గత ప్రభుత్వం సరఫరా చేసిన కుట్టు మిషన్ల సామగ్రి చోరీ అయింది. కుట్టు మిషన్లకు సంబంధించిన విడి భాగాలు మాయం కావటంపై అందరి నుంచి విస్మయం వ్యక్తం అవుతోంది. కుట్టు మిషన్ల మాయంపై పోలీసులకు ఫిర్యాదు చేసినట్లు ఎంపీడీవో ప్రవీణ్‌కుమార్ సోమవారం తెలిపారు.

గత ప్రభుత్వం ముస్లిం మైనార్టీ మహిళల కోసం ఉచితంగా కుట్టు మిషన్లు అందించారు. గత ఎన్నికలకు ముందు మండల పరిషత్తు కార్యాలయానికి 83 కుట్టు మిషన్లను సరఫరా చేశారు. కుట్టు మిషన్లకు సంబంధించిన విడిభాగాలను కార్యాలయానికి పంపించారు. వీటిని ఎంపీవో కార్యాలయంలో భద్రపరిచారు. సామగ్రి పక్కనే ఎంపీవో కుర్చీ, కంప్యూటర్ ఆపరేటర్లు విధులు నిర్వహిస్తుంటారు. ఎన్నికల నేపథ్యంలో వీటిని అధికారులు పంపిణీ చేయలేదు. అయితే ఇక్కడ ఇరుకుగా ఉండటంతో కొద్దిరోజుల క్రితం సామాగ్రిని ఎంపీపీ గదిలోకి మార్చారు.

సామగ్రి మార్పేక్రమంలోనే కుట్టు మిషన్లకు సంబంధించిన 49 మోటార్లు, 19 హెడ్‌లు, 17 బేస్‌లు, 14 స్టాండులు తక్కువగా ఉన్నట్లు గుర్తించారు. వీటి విలువ రూ.2లక్షల పైగానే ఉంటుందని సమాచారం. మిషన్ల మాయం వెనుక సిబ్బంది, అధికారుల హస్తం ఏమైనా ఉందే అనుమానాలు వ్యక్తమవుతున్నాయి.

- గత ఏడాది కన్నా ఈ ఏడాది 6.84శాతం క్రైం రేటు అధికం
- గంజాయి పై ఉక్కు పాదం.. 8000 కిలోల సీజ్..
- సైబర్‌నేరాల్లో రూ.1.35కోట్ల రికవరీ
- నక్సల్స్ ప్రభావిత ప్రాంతాల్లో విస్తృతంగా సంక్షేమం, ఉపాధి
- 35మంది మావోయిస్టుల లొంగుబాటు, 60మంది అరెస్టు
- భద్రాద్రి కొత్తగూడెం జిల్లా ఎస్పీ రోహిత్‌రాజ్



విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న భద్రాద్రి కొత్తగూడెం ఎస్పీ రోహిత్‌రాజ్

పారదర్శకంగా ఎఫ్ఐఆర్‌ల నమోదుతో
కేసులు పెరిగాయి

కొత్తగూడెం, డిసెంబరు 30 (ఆంధ్రజ్యోతి): 2024సంవత్సరంలో ప్రజల ఇచ్చిన ఫిర్యాదులు స్వీకరించి పారదర్శకంగా ఎఫ్ఐఆర్‌లు నమోదు చేయడంతో జిల్లాలో కేసుల సంఖ్య పెరిగిందని, గత ఏడాది కంటే ఈ ఏడాది 6.84శాతం క్రైం రేటు పెరిగిందని భద్రాద్రి కొత్తగూడెం జిల్లా ఎస్పీ రోహిత్‌రాజ్ తెలిపారు. సోమవారం ఎస్పీ కార్యాలయంలో ఏర్పాటుచేసిన విలేకరుల సమావేశంలో ఆయన 2024లో కేసుల గురించి వివరించారు.

2023 సంవత్సరంలో 50 రేప్ కేసులు నమోదు కాగా 2024 ఏడాదిలో 89 రేప్ కేసులు నమోదైనట్లు ఎస్పీ తెలిపారు. ఛత్తీస్‌గఢ్, ఒరిస్సా ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాల నుంచి అక్రమంగా జిల్లాలోకి రవాణ అవుతున్న గంజాయి, మాదకద్రవ్యాలపై ఉక్కుపాదం మోపినట్లు తెలిపారు. 2023 సంవత్సరంలో గంజాయి 76కేసులు నమోదు కాగా 2024 సంవత్సరంలో 102 గంజాయి కేసులు నమోదు అయ్యాయన్నారు. 8వేల కేజీల గంజాయిని పట్టుకుని సీజ్‌చేసి సంబంధిత నేరగాళ్లపై కేసులు నమోదు చేసి గంజాయిని కూడ తగలపెట్టినట్లు తెలిపారు. సైబర్‌నేరాలు 196కేసులు నమోదు కాగా, రూ.1.35కోట్లు రికవరి చేసినట్లు తెలిపారు.

20,69కేసులు కోర్టుల్లో ట్రయల్‌కు రాగా అత్యధిక కేసుల్లో నిందితులకు శిక్షపడేలా చర్యలు తీసుకున్నట్లు తెలిపారు. జిల్లాలో ప్రధానంగా పోలీసులకు, మావోయిస్టులకు మధ్య రెండు ఎన్‌కౌంటర్లు జరిగాయన్నారు. కరకగూడెం మండలంలోని మోతె గ్రామసమీప అడవుల్లో ఈ ఏడాది సెప్టెంబరు 5వ తేదీ తెల్లవారుఝామున ఎన్‌కౌంటరులో ఆరుగురు మావోయిస్టులు మృతి చెందారని తెలిపారు. 2024లో మొత్తం 35మంది మావోయిస్టులు లొంగిపోయారని, 60మంది మావోయిస్టులను వివిధ పోలీస్‌స్టేషన్ల ద్వారా అరెస్టు చేసి జైలుకు తరలించినట్లు తెలిపారు పీడీఎస్ రైసుకు సంబంధించిన 71 కేసులు నమోదు చేశామని, అక్రమంగా తరలివెళ్తున్న ఇసుకను పట్టుకుని మొత్తం 215 కేసులు నమోదు చేసినట్లు తెలిపారు. ఎన్నికల సమయంలో వాహనాలను తనిఖీ చేసి రూ. 11.28 లక్షల నగదును సీజ్ చేశామని ఎస్పీ తెలిపారు. 180మందిపై కేసులు నమోదు చేసినట్లు తెలిపారు. షీ టీంలను ఏర్పాటు చేసి 76కేసులు నమోదుచేశామని తెలిపారు.

పోలీసు పహారా మధ్య రోడ్డు నిర్మాణానికి అధికారుల యత్నం

- సొంత స్థలంలో రోడ్డు నిర్మిస్తున్నారని వ్యక్తి ఆత్మహత్యాయత్నం
- ప్రథమ చికిత్స అనంతరం ఖమ్మం తరలింపు
- భార్యను పోలీస్‌స్టేషనుకు తరలించిన ఎస్సై
- కాంగ్రెస్ నాయకుడు సుబ్బారెడ్డిపై బాధితుడి ఆరోపణ
- నిర్మాణ స్థలంపై స్పష్టత ఇవ్వలేకపోయిన ఎంపీఈవో



వివాదాస్పదస్థలంలో పోలీసులు

సత్తుపల్లి, డిసెంబరు 30 (ఆంధ్రజ్యోతి): సత్తుపల్లి మండలం రేజర్ల గ్రామ పంచాయతీ పరిధిలో రోడ్డు నిర్మాణం వివాదాస్పదంగా మారింది. తన సొంత స్థలంలో నుంచి అధికారులు, అధికార పార్టీ నాయకుడి ప్రోద్బలంతో పోలీసు పహారా మధ్య రోడ్డు నిర్మిస్తున్నారని అడ్డుకునే ప్రయత్నంలో వ్యక్తి ఆత్మహత్యాయత్నానికి పాల్పడిన సంఘటన సోమవారం జరిగింది. ఈ సంఘటన మండలంలో సంచలనంగా మారింది. సత్తుపల్లి మండలం రేజర్ల గ్రామంలో గ్రామ పంచాయతీ పరిధిలో రోడ్డు నిర్మాణానికి గత కొద్ది నెలలుగా అధికారులు ప్రయత్నిస్తున్నారు. ఈ క్రమంలో తన సొంత స్థలం నుంచి రోడ్డు నిర్మాణం చేయవద్దని రేజర్లకు చెందిన కనమతరెడ్డి శ్రీనివాస రెడ్డి అభ్యంతరం వ్యక్తం చేస్తూ వస్తున్నారు.

తాజాగా రోడ్డు నిర్మాణం

సోమవారం అధికారులు సిమెంట్ రోడ్డు నిర్మాణం కోసం ఏర్పాట్లు చేశారు. రోడ్డు నిర్మాణ పనులు ప్రారంభ సమయంలో శ్రీనివాసరెడ్డి, ఆయన భార్య కమల అభ్యంతరం వ్యక్తం చేసి పనులు అడ్డుకునే ప్రయత్నం చేశారు. దీంతో పోలీసులు రంగ ప్రవేశం చేశారు. పనులు అడ్డుకుంటున్న వారిని పోలీస్టేషన్‌కు తరలించే ప్రయత్నం చేయటంతో పాటు సదరు స్థలం కోర్టులో ఉందని రోడ్డు నిర్మాణం చేయవద్దని స్పష్టం చేశారు. కోర్టు వివాదానికి సంబంధించి పత్రాలు చూపాలని ఎస్సై కోరారు. రాజకీయ నాయకుల ప్రోద్బలంతో పనులు చేయిస్తున్నారని బాధితులు ఆరోపించగా, తాము పై నుంచి వచ్చిన ఆదేశాలు పాటిస్తున్నామని ఎస్సై చెప్పారు. కోర్టు పత్రాలను వెంటనే చూపించాలని, ఎందుకు ఆలస్యం చేస్తున్నారని ఎస్సై అన్నారు.



చికిత్స పొందుతున్న శ్రీనివాసరెడ్డి

ఆత్మహత్యాయత్నం

వివాదం నేపథ్యంలో జరిగిన వాగ్వాదం సందర్భంగా శ్రీనివాసరెడ్డి పురుగుల మందు తాగి ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డాడు. అతడిని చికిత్స నిమిత్తం పోలీసులు సత్తుపల్లి ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. ప్రథమ చికిత్స అనంతరం ఖమ్మం తరలించారు. శ్రీనివాసరెడ్డిని ప్రభుత్వ ఆసుపత్రికి తరలించిన పోలీసులు అతడి భార్య కమలను పోలీసుస్టేషన్‌కు తీసుకెళ్లటం చర్చనీయాశంగా మారింది. భర్త ఆత్మహత్యాయత్నం చేస్తే భార్యను స్టేషన్‌కు తీసుకెళ్లడంపై గ్రామంలో విమర్శలు వెల్లువెత్తాయి.

స్థానిక కాంగ్రెస్ నాయకుడు సుబ్బారెడ్డి ప్రోద్బలంతో ప్రభాకర్, ఖలీల్‌ల ఆధ్వర్యంలో తన సొంత స్థలంలో రోడ్డు దౌర్జన్యంగా నిర్మిస్తున్నారని బాధితుడు శ్రీనివాసరెడ్డి ఆసుపత్రిలో చికిత్స పొందుతూ ఆరోపించారు. దీనికి సంబంధించి వీడియో సామాజిక మాధ్యమాల్లో వైరల్‌గా మారింది. వివాదాస్పద స్థలం గురించి ఎంపీఈవో కృష్ణను సంప్రదించగా సదరు స్థలం శ్రీనివాసరెడ్డిదేనని, అతనే నిరూపించుకోవాల్సి ఉందని చెప్పటం కొసమెరుపు. గతం నుంచి ప్రజలు నడుస్తున్నారని, అందుకే రోడ్డు నిర్మాణం చేపట్టామని మరో సారి చెప్పారు. సొంత స్థలమా లేక గ్రామ పంచాయతీ స్థలమా అనేది తనకు తెలియదని చెప్పారు. స్థలంపై స్పష్టత లేకుండా పోలీసులను ఎలా పిలిపించారని ప్రశ్నించగా సమాధానం చెప్పలేదు. వివాదం ఉన్న స్థలంలో కాకుండా రోడ్డు నిర్మాణం చేశామని చెప్పారు. మొత్తంగా వివాదం చినికిచినికి గాలివానగా మారింది.

'ఇస్రో స్టార్ట్'కు ఎంపికైన సింగరేణి కాలేజీ



కొత్తగూడెం పోస్టాఫీస్‌సెంటర్, డిసెంబరు 30(ఆంధ్రజ్యోతి): కొత్తగూడెం సింగరేణి మహిళా డిగ్రీ కళాశాల ఇస్రో (ఇండియన్ స్పేస్ రీసెర్చి ఆర్గనైజేషన్) స్టార్ట్ ప్రోగ్రాంకు ఎంపికైందని నోడల్ అధికారి, కళాశాల ఇన్‌చార్జి ప్రిన్సిపాల్ డాక్టర్ శైలజ సోమవారం తెలిపారు. దేశాభివృద్ధి లక్ష్యంగా భారతీయ అంతరిక్ష పరిశోధనా సంస్థ విజ్ఞానాన్ని అభివృద్ధి చేసే ఉద్దేశ్యంలో భాగంగా ఇస్రో పేరు ప్రఖ్యాతులు సందరించుకుందన్నారు. ఈ సంస్థ ఇటీవల విద్యార్థులకు అంతరిక్ష పరిశోధన పట్ల అవగాహన కల్పించే దిశగా కొన్ని కోర్సులను ఆన్‌లైన్‌లో శిక్షణ అందించేందుకు ముందుకు వచ్చిందని తెలిపారు. ఈ క్రమంలో సింగరేణి విద్యా సంస్థలను సెంటర్ ఆఫ్ ఎక్సలెన్సీగా తీర్చిదిద్దాలన్న దృఢ సంకల్పంతో సింగరేణి సీఎండీ బలరాం నేతృత్వంలో సింగరేణి మహిళా కళాశాల ఎడ్యుకేషనల్ సొసైటీ సెక్రటరీ గుండా శ్రీనివాస్ సారథ్యంలో ఇస్రో సంస్థకు ఈ శిక్షణ కోసం దరఖాస్తు చేసినట్లు తెలిపారు. జిల్లాలోనే ఇస్రో అనుసంధానంతో ఇస్రో స్టార్ట్ ప్రోగ్రాం కు మొట్ట మొదటి నోడల్ కళాశాలగా సింగరేణి మహిళా డిగ్రీ కళాశాల ఎంపికైందని తెలిపారు. ఈ కళాశాల నోడల్ సెంటర్ కో-ఆర్డినేటర్‌గా కెమిస్ట్రీ విభాగానికి చెందిన విభాగాధిపతిగా విధులు నిర్వహిస్తున్న తననే ఎంపిక చేసినట్లు ప్రిన్సిపాల్ శైలజ తెలిపారు. కళాశాలలో డిగ్రీ తృతీయ సంవత్సరం చదువుతున్న సైన్స్ విద్యార్థినులకు జనవరి 9 నుంచి 27వ తేదీ వరకు ఆన్‌లైన్‌లో మూడు వారాల పాటు శిక్షణ ఉన్నట్లు తెలిపారు. ఆన్‌లైన్ విధానంలోనే పరీక్షలు నిర్వహించి, ఈ సర్టిఫికెట్స్‌ను అందజేయనున్నట్లు తెలిపారు.

స్కాలర్‌షిప్‌ల దరఖాస్తు ఫారాలు అందించాలి

- బీసీ అభివృద్ధి అధికారులు జ్యోతి, ఇందిర

ఖమ్మం ఖానాపురంహవేలీ/ చుంచుపల్లి, డిసెంబరు 30(ఆంధ్రజ్యోతి): వెనుకబడిన తరగతుల సంక్షేమ శాఖ పరిధిలోని ప్రభుత్వ, ప్రైవేటు, యూనివర్సిటీ ఇంజనీరింగ్, నర్సింగ్ కళాశాలలు 2017-18 నుంచి 2023-24 సంవత్సరాల వరకు పెండింగ్‌లో ఉన్న ఉపకార వేతనాల దరఖాస్తు ఫారాలను జనవరి 20లోగా అందజేయాలని ఇరు జిల్లాల వెనుకబడిన తరగతుల అభివృద్ధి అధికారులు జి. జ్యోతి, ఇందిర జి. జ్యోతి సోమవారం వేర్వేరు ప్రకటనల్లో కోరారు. కలెక్టరేట్‌లో రెండో అంతస్తులో ఉన్న జిల్లా వెనుకబడిన తరగతుల అభివృద్ధి అధికారి కార్యాలయంలో పెండింగ్ దరఖాస్తులను అందజేయాలని కోరారు. ట్యూషన్ ఫీజులకు సంబంధించి చాలా అప్లికేషన్లు నో-ఫీజు అని ఈ-పాస్ వెబ్ సైట్లో చూపిస్తోందని, కళాశాలల యాజమాన్యాలు సోషల్‌వెల్ఫేర్ డిపార్ట్మెంట్‌లో, పీఎంయూ సెంటర్‌లో సంప్రదించి ఫీజుల వివరాలను ఈ-పాస్ వెబ్ సైట్లో అప్డేట్ చేయించు కోవాలని కోరారు. ఫీజుల వివరాలు అప్‌డేట్ చేయని కళాశాలలకు ట్యూషన్ ఫీజు రాకపోతే సంబంధిత కళాశాలల యాజమాన్యమే పూర్తి బాధ్యత వహించాల్సి ఉంటుందని పేర్కొన్నారు. అలాంటి వారిపై శాఖాపరమైన చర్యల కోసం పై అధికారులకు సిఫారసు చేస్తామని తెలిపారు.

పింఛన్.. బాంఛన్..

'ఆసరా' కోసం గిరిజన దివ్యాంగుడి వేడుకోలు



భద్రు, కృష్ణవేణి దంపతులు

పెనుబల్లి, డిసెంబరు 30 (ఆంధ్రజ్యోతి): పెనుబల్లి మండలం పాతకారాయిగూడెం తండాకు చెందిన గుగులోతు భద్రు అనే గిరిజన నిరుద్యోగి పోలియోతో బాధపడుతున్నాడు. ఒక రెండు కాళ్లు చచ్చుబడిపోవడంతో మంచానికే పరిమితం అయ్యాడు. ఇంటికే పరిమితమైన భద్రు దివ్యాంగ పింఛన్ కోసం దరఖాస్తు చేసినా అధికారులు మంజూరు చేయడం లేదు.

మొదటిసారి ఒక కాలు ఇబ్బందిగా ఉన్న సమయంలో దరఖాస్తు చేసుకోగా సదరమ్ క్యాంపులో 42శాతం అంగవైకల్యం ఉన్నట్లుగా ధ్రువపత్రాన్ని అధికారులు ఇచ్చారు. ఆతర్వాత అనేకసార్లు అధికారులకు దరఖాస్తులు చేసుకున్నప్పటికీ ప్రజాపాలనలోనూ దరఖాస్తు చేసుకున్నప్పటికీ సరదమ్ సర్టిఫికెట్ లేదని అధికారులు పింఛన్ మంజూరు చేయడంలేదు. అధికారులు స్పందించి తనకు పింఛన్ మంజూరు చేయాలని కోరుతున్నాడు. ఎవరైనా దాతలు ముందుకొచ్చి తనకు వీల్‌ఛైర్‌ను అందజేయాలని భద్రు కుటుంబం వేడుకుంటుంది.

ఉన్నత విద్యావంతుడైన భద్రు భద్రు ఒక కాలు పనిచేసిన సందర్భంలో భార్య కృష్ణవేణి సహాయంతో ఇంటి వద్దనే తినుబండారాలను తయారుచేసుకొని ఆప్యాకెట్లను ఆటోతో దుకాణాలకు సప్లయి చేసేవాడు. ఈ తరుణంలో ఆటో ప్రమాదానికి గురికావడంతో ఆవ్యాపారాన్ని కూడా మానేయాల్సిన పరిస్థితి ఏర్పడింది. ఈ పరిస్థితుల్లో గ్రామంలోని పాఠశాలలో విద్యావలంటీర్‌గా భద్రు రెండేళ్లపాటు పనిచేశాడు. భద్రు రెండో కాలు నరాల బలహీనత వల్ల చచ్చుబడిపోవడంతో గత ఆరేళ్లుగా ఇంటికే పరిమితమయ్యాడు. భార్య కృష్ణవేణి కూలీపనులకు వెళ్తేనే కుటుంబం గడుస్తోంది.

వివాహితపై వేధింపులు.. కేసు నమోదు

కల్లూరు, డిసెంబరు 30 (ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని ఓ గ్రామంలో వివాహితపై వేధింపులకు పాల్పడిన ఘటనలో సోమవారం ఇద్దరు యువకులపై పోలీసులు కేసు నమోదు చేశారు. మండల పరిధిలోని ఓ గ్రామంలో మహిళ.. తనపై లైంగికంగా వేధించినట్లు ఇద్దరు యువకులపై ఫిర్యాదు చేసింది.

తొమ్మిది మంది జూదరుల అరెస్టు

చింతకాని, డిసెంబరు30(ఆంధ్రజ్యోతి): లచ్చగూడెం గ్రామంలోని నల్లకుంట చెరువు సమీపంలో పేకాట ఆడుతున్న తొమ్మిది మందిని పోలీసులు సోమవారం పట్టుకున్నారు. వారి వద్ద నుంచి రూ 24 వేల నగదు, మూడు ద్విచక్ర వాహనాలు, తొమ్మిది సెల్‌ఫోన్లు స్వాధీనం చేసుకున్నాట్టు ఎస్‌ఐ నాగుల్‌మీరా తెలిపారు.

చికిత్స పొందుతూ యువకుడి మృతి

చింతకాని, డిసెంబరు 30(ఆంధ్రజ్యోతి): నరసింహపురం గ్రామానికి చెందిన బుర్రా లక్ష్మణుడు(21) చికిత్స పొందుతూ సోమవారం మృతిచెందాడు. ఈ నెల 26న పురుగుల మందు తాగడంతో ఆసుపత్రిలో చేర్పించారు. చికిత్స పొందుతూ మృతిచెందాడు.

క్లినికల్ అప్రెంటిషిప్ కోసం దరఖాస్తులు

ఖమ్మం ఖానాపురంహవేలి, డిసెంబరు 30(ఆంధ్రజ్యోతి): ఇంటర్మీడియట్ ఎమ్మెల్టీ ఒకేషనల్ కోర్సుల్లో మార్చి 2020 సంవత్సరం నుంచి ఉత్తీర్ణులైన విద్యార్థులకు ఒక సంవత్సరం క్లినికల్ అప్రెంటిషిప్ శిక్షణ కోసం దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు జిల్లా ఇంటర్మీడియట్ విద్యాధికారి కె. రవిబాబు సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. సత్తుపల్లి, మధిర, తిరుమలయపాలెం ఏరియా ఆస్పత్రుల్లో శిక్షణ అందిస్తామని తెలిపారు. ఎంపికైన వారు రూ.1000ని డీడీ రూపంలో చెల్లించాలని, గతంలో దరఖాస్తు చేసుకోని, ఎంపిక కాని వారు కూడా తాజాగా దరఖాస్తు చేసుకోవచ్చని తెలిపారు. ఆసక్తిగల విద్యార్థులు బయోడేటా ఫారంతో పాటు పది రూపాయల పోస్టల్ స్టాంప్ అతికించిన సొంత చిరునామా కవర్, సర్టిఫికెట్స్ జిరాక్స్ కాపీలను జతపరిచి కలెక్టరేట్ లోని జిల్లా ఇంటర్మీడియట్ విద్యాధికారి కార్యాలయంలో జనవరి 6 లోగా అందజేయాలని తెలిపారు.

ఆంధ్రజ్యోతి KHAMMAM CITY మంగళవారం 31 డిసెంబరు 2024



ప్రజావాణి దరఖాస్తులు పరిష్కరించాలి



ఫిర్యాదులు స్వీకరిస్తున్న అదనపు కలెక్టర్లు

» అదనపు కలెక్టర్లు శ్రీజ, శ్రీనివాసరెడ్డి

ఖమ్మంకలెక్టరేట్, డిసెంబరు30(ఆంధ్రజ్యోతి): ప్రజావాణి దరఖాస్తులను సత్వరమే పరిష్కరించాలని అదనపు కలెక్టర్లు పి.శ్రీజ, పి.శ్రీనివాసరెడ్డి సంబంధిత జిల్లా అధికారులను ఆదేశించారు. సోమవారం ప్రజావాణి కార్యక్రమం సందర్భంగా జిల్లా నలుమూలల నుంచి వచ్చిన ప్రజల నుంచి దరఖాస్తులను స్వీకరించారు. ఈసందర్భంగా ప్రజల నుంచి అందిన దరఖాస్తులపై ఆయా శాఖల అధికారులను పరిష్కారానికి ఆదేశించారు. అనంతరం ఆయా శాఖల పరిధిలో పెండింగ్ దరఖాస్తులపై సమీక్షించారు.ఈ కార్యక్రమంలో డీఆర్‌వో సన్యాసయ్య, జిల్లా రెవెన్యూ అధికారి రాజేశ్వరి, వివిధ శాఖల జిల్లా అధికారులు, కలెక్టరేట్ ఏవో అరుణ పాల్గొన్నారు.

ఇందిరమ్మ సర్వేకు వినతుల వెల్లువ



ఫిర్యాదులు స్వీకరిస్తున్న మేయర్,కమిషనర్

» ప్రజావాణిలో ఫిర్యాదులు స్వీకరించిన మేయర్, కమిషనర్

ఖమ్మంసంక్షేమవిభాగం,డిసెంబరు30 (ఆంధ్రజ్యోతి): ప్రజాపాలనలో ఇళ్లు లేదని తాము నమోదు చేయించినా ఇందిరమ్మ సర్వేకు తమ నివాసాలకు బృందాలు రావటం లేదని ఫిర్యాదులు వెల్లువెత్తాయి. ఖమ్మం నగర పాలక సంస్థ కార్యాలయంలో సోమవారం ప్రజావాణి కార్యక్రమం నిర్వహించారు. మేయర్ పునుకొల్లు నీరజతో కలిసి కమిషనర్ అభిషేక్ అగస్త్య ఫిర్యాదులు స్వీకరించారు. 50వ డివిజన్‌లో ఇంటి నెంబర్లు కేటాయించాలని రాపర్తి శరత్ ప్రజలతో వచ్చి వినతిపత్రం అందించారు. ఇందిరమ్మ ఇళ్లు, మున్నేరు వరద బాధితులకు పరిహారం, తాగునీటి సమస్యలు, పారిశుధ్య కార్యక్రమాలు చేపట్టాలని, అక్రమ నిర్మాణాలు తొలగించాలని ఫిర్యాదులు అధిక సంఖ్యలో వచ్చాయి. అసిస్టెంట్ కమిషనర్ షఫీఉల్లా,ఈఈ కృష్ణలాల్, ఆర్వో శ్రీనివాసరావు, ఏవో శ్రీశైలం, ఫుడ్ ఇన్‌స్పెక్టర్ కిరణ్‌కుమార్, ఆర్ఐ జ్యోతి పాల్గొన్నారు.

చెరువుల ఆక్రమణలు తొలగించాలని తీర్మానం

ఖమ్మంరూరల్, డిసెంబరు30(ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని ఏదులాపురం గ్రామపంచాయతీలో డెవలప్‌మెంట్ ప్లాన్ సమావేశాన్ని సోమవారం ప్రత్యేక అధికారి ఎంపీవో రాజారావు ఆధ్వర్యంలో సెక్రటరీ శ్రీధర్‌రెడ్డి అధ్యక్షత నిర్వహించారు. పలు సమస్యలపై ప్రజల నుంచి పలు అర్జీలను స్వీకరించారు. చెరువు ఆక్రమణపై అధికారులను రాజకీయనేతలు నిలదీశారు. ఏదులాపురం, వరంగల్ క్రాస్‌రోడ్డు, చిన్నతండా, తాళ్లేసేతండా,పెద్దతండా ప్రాంతాలు మంచినీటి ఎద్దడికి గురవుతున్నట్లు ఆవేదన వ్యక్తంచేశారు.తక్షణమే రెవెన్యూ, ఇరిగేషన్ అధికారుల దృష్టికి తీసుకెళ్లి చెరువుల ఆక్రమణలు తొలగించి హద్దులను ఏర్పాటుచేయాలని డిమాండ్ చేశారు.లేనిపక్షంలో ఆల్ పార్టీస్ ఆధ్వర్యంలో ప్రజలను సమీకరించి చెరువు వద్ద ఆందోళన నిర్వహిస్తామని హెచ్చరించారు. దీనిపై ప్రత్యేకఅధికారి ఎంపీవో రాజారావు మాట్లాడుతూ తక్షణమే తీర్మానంచేసి రెవెన్యూ, ఇరిగేషన్ అధికారుల దృష్టికి తీసుకువెళ్తామని పేర్కొన్నారు. ఈ సమావేశంలో సెక్రటరీ శ్రీధర్‌రెడ్డి, సీపీఐనాయకులు దండి రంగారావు, వెంపటి రాము, మేళ్లచెరువు రవి, మేళ్లచెరువు సాయి, యువజన సంఘం సభ్యులు రెబ్బగండ్ల గోపి, మేళ్లచెరువు నరేష్, నారపాటి నరేష్, నారపాటి వెంకటేశ్వర్లు, సీపీఎం మండల కార్యదర్శి పురాడి సుదర్శన్‌రెడ్డి, ఆరంపులు నరేష్ పాల్గొన్నారు.

వండర్ బుక్ ఆఫ్ రికార్డులో వీరవెంకటరెడ్డి

ఖమ్మంచర్చికాంపౌండ్, డిసెంబరు30(ఆంధ్రజ్యోతి): సత్తుపల్లి మండలం సదాశివునిపాలెం గ్రామానికి చెందిన వీరవెంకటరెడ్డి సాహిత్య రంగంలో రచనలకుగాను వండర్ బుక్‌ఆఫ్ రికార్డులో పేరు నమోదైంది. సోమవారం నగరంలోని భక్తరామదాసు కళాక్షేత్రంలో ఇండియన్ ఆర్గనైజేషన్ ఆధ్వర్యంలోనిర్వహించిన కార్యక్రమంలో అవార్డును, ప్రశంసాపత్రాన్ని అందించారు.

తెలంగాణ ఉద్యమకారులను ఆదుకోవాలి

మధిర, డిసెంబరు 30 (ఆంధ్రజ్యోతి): తొలితరం తెలంగాణ ఉద్యమకారులను గుర్తించి ఆదుకోవాలని ప్రభుత్వాన్ని కోరుతూ పలువురు నాయకులు సోమవారం ప్రజావాణిలో తహసీల్దార్‌కు వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ 1969లో మధిర నుంచి తెలంగాణ ఉద్యమంలో పాల్గొన్న నాయకులను గుర్తించి గుర్తింపు కార్డులు ఇవ్వాలని, ఉద్యమకారులకు ఇచ్చే రాయితీ లు కల్పించాలని తదితర తమ సమస్యలను వివరిస్తూ డిప్యూటీ సీఎంను అడ్రస్ చేస్తూ వినతి పత్రం అందజేశారు. ఈకార్యక్రమంలో పుతుంబాక శ్రీకృష్ణ ప్రసాద్, రిటైర్డ్ ఉద్యోగి ఎండీ ఖాసీం, రమావత్ బాబూరావు, బాహటం సుబ్బరాజు, ఎలగందుల రాధాకృష్ణ, అవధానుల బాస్కర్, వెల్లంకి రాజేంద్రప్రసాద్, దోసపాటి వెంకట నాగ సోమేశ్వరరావు, కుందా వెంకటనారాయణ, టీవీరెడ్డి పాల్గొన్నారు.

సీపీఎం నాయకుడికి పరామర్శ

నేలకొండపల్లి,డిసెంబరు30(ఆంధ్రజ్యోతి): ఇటీవల అనారోగ్యానికి గురైన సీపీఎం మండల నాయకుడు కోడూరి వెంకటాచారిని సోమవారం జిల్లా, మండల నాయకులు పరామర్శించారు. కొద్దిరోజుల క్రితం వెంకటాచారి ప్రమాదవశాత్తు కిందపడటంతో కాలువిరిగింది. దీంతో ఆయన ఖమ్మంలోని ఓప్రైవేటు వైద్యశాలలో చికిత్స తీసుకుని నేలకొండపల్లిలోని ఇంటికి తిరిగి వచ్చారు. దీంతో జిల్లా నాయకుడు గుడవర్తి నాగేశ్వరరావు, డివిజన్ సీఐటీయూ నాయకుడు పగిడికత్తుల నాగేశ్వరరావు చారిని పరామర్శించారు.

క్రమశిక్షణతో నేర్చుకోవాలి

సత్తుపల్లి, డిసెంబరు 30 (ఆంధ్రజ్యోతి): స్వయం ఉపాధి కోసం సింగరేణి ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ఉచిత వృత్తి శిక్షణను శ్రద్ధగా, క్రమశిక్షణతో నేర్చుకోవాలని సింగరేణి సేవా సమితి అధ్యక్షురాలు జీ.మధురవాణి షాలెం రాజు కోరారు. సోమవారం స్థానిక ఐకేపీ భవనంలో మహిళలకు కంప్యూటర్ కోర్స్, టైలరింగ్ కోర్స్, మగ్గం ఫ్యాషన్ డిజైనింగ్ కోర్సులను ఆమె ప్రారంభించారు. శిక్షణ పొందిన వారికి పరీక్షలు నిర్వహించి ఉత్తీర్ణులైన వారికి సర్టిఫికేట్లు ఇవ్వనున్నట్లు చెప్పారు. కార్యక్రమంలో కౌన్సిలర్ కంటే నాగలక్ష్మి, జేవీఆర్ ఓసీ సీనియర్ పీవో కే.దేవదాస్, సభ్యులు భవానీ రవీందర్, సీహెచ్.సాగర్ తదితరులు పాల్గొన్నారు.

పార్కు కార్మికుల వేతనాల స్వాహా

» కాంట్రాక్టర్ ఇచ్చిన రూ.లక్షను వాడుకున్న సూపర్‌వైజర్

» కమిషనర్ ఎదుటే కార్మికులు, కాంట్రాక్టర్ పంచాయతీ



కమిషనర్‌కు ఫిర్యాదు చేస్తున్న కార్మికులు

ఖమ్మంసంక్షేమవిభాగం, డిసెంబరు29 (ఆంధ్రజ్యోతి): కాంట్రాక్టర్‌కు పార్కు కార్మికులకు మధ్య సమన్వయకర్తగా ఉండాల్సిన కేఎంసీ ఉద్యోగి... కార్మికుల వేతనాలను స్వాహా చేశాడు. ఈ సంఘటన సోమవారం వెలుగుచేసింది. కేఎంసీ కమిషనర్‌కు కాంట్రాక్టర్‌ను కార్మికులు ప్రశ్నించటంతో స్వాహా సంఘటన బయటపడింది. ఖమ్మం నగర పాలక సంస్థ పరిదిలోని జయశంకర్ పార్కు, గోళ్లపాడు ఛానల్ పార్కులో 25 మంది కార్మికులు పనిచేస్తున్నారు. కార్మికులకు 5నెలల వేతనాలు కాంట్రాక్టర్ ద్వారా చెల్లించాల్సి ఉంది. కాగా వేతనాలు అందలేదని కార్మికులు కమిషనర్ దృష్టికి తీసుకెళ్లారు. సదరు కాంట్రాక్టర్ కిషోర్‌ను కమిషనర్ పిలిపించి వివరణ కోరారు. ఈ నేపథ్యలో కార్మికుల వేతనాల స్వాహా విషయం బయటపడింది. కాంట్రాక్టర్ నుంచి పార్కుల సూపర్‌వైజర్ బాలు సుమారుగా రూ.1 లక్ష వరకు తీసుకున్నట్లు సంతకాలు ద్వారా నిర్ధారణ చేశారు. దీంతో పూర్తి స్థాయిలో విచారణ చేసి కార్మిలకు రెగ్యులర్‌గా వేతనాలు అందేలా చర్యలు తీసుకుంటామని కమిషనర్ అభిషేక్ అగస్త్య తెలిపారు.

దాడిపై విచారణకు ఆదేశం

కాల్వొడ్డు వైకుంఠధామం ఉద్యోగి పుల్లయ్యపై డ్రైవర్ అన్వర్ దాడి చేసిన సంఘటనపై పూర్తి స్థాయిలో విచారణ చేసి నివేదిక ఇవ్వాలని కమిషనర్ అభిషేక్ అగస్త్య అసిస్టెంట్ కమిషనర్ షఫీ ఉల్లా, పారిశుధ్య సూపర్‌వైజర్ సాంబయ్యను ఆదేశించారు. బాధితుడు పుల్లయ్య కమిషనర్‌ను కలిసి సంఘటన,కేఎంసీకిజమకావాల్సిన డబ్బులు విషయం, ఖమ్మం త్రీటౌన్‌లో పోలీసు ఫిర్యాదుపై వివరించారు. దీంతో స్పందించిన కమిషనర్ పూర్తి స్థాయిలో విచారణ చేపట్టాలని ఆదేశించారు.

గీతాంజలి విద్యార్థులకు కలెక్టర్ అభినందన



విద్యార్థులతో పాఠశాల డైరెక్టర్

ఖమ్మంఖానాపురంహవేలి, డిసెంబరు30 (ఆంధ్రజ్యోతి): మున్నేరు వరదల సమయంలో నగరంలోని గీతాంజలి విద్యార్థులు దాసుకున్న ప్యాకెట్‌మని రూ.30వేలను గతంలో కలెక్టర్‌కు అందించారు. ఈ నేపథ్యలో తాజాగా కలెక్టర్ ముజామ్మిల్‌ఖాన్ పాఠశాలకు ప్రశంశాపత్రాన్ని పోస్టల్‌లో పంపారు. ఈ సందర్భంగా విద్యార్థులను పాఠశాల కరస్పాండెంట్ టీవీ అప్పారావు, పాఠశాల డైరెక్టర్లు టి.పద్మా, అరుణ్ అభినందించారు.

అమిత్‌షా దిష్టిబొమ్మ దహనం

తిరుమలాయపాలెం, డిసెంబరు30(ఆంధ్రజ్యోతి): రాజ్యాంగ నిర్మాత అంబేద్కర్‌పై పార్లమెంట్‌లో హోంశాఖ మంత్రి అమిత్‌షా చేసిన వ్యాఖ్యలు నిరసిస్తూ సోమవారం దమ్మాయిగూడెంలో ఏఐపీకేఎంఎస్ ఆధ్వర్యంలో అమిత్‌షా దిష్టిబొమ్మ దహనం చేశారు. ఆందోళనకారులు రహదారిపై బైటాయించి కేంద్ర ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. ఈకార్యక్రమంలో జిల్లా ప్రధాన కార్యదర్శి తిమ్మిడి హనుమంతరావు మాట్లాడుతూ జై శ్రీరామ్ అంటే అందరు స్వర్గానికిపోతారని మతోన్మాదాన్ని పెంచి పోషిస్తున్న బీజేపీకి తగిన బుద్ధి చెప్పాలన్నారు.ఈకార్యక్రమంలో ప్రజపంథా మండల కార్యదర్శి ఎస్.వెంకటేశ్వర్లు, ఉన్నం రమేష్, తమ్మిడి రఘుబాబు, పమ్మి జగదీష్, లాలయ్య పాముల వెంకన్న, అర్జున్ పాల్గొన్నారు.

ప్రతిభ చాటిన ఎస్ఎస్‌వీ విద్యార్థులు

తిరుమలాయపాలెం,డిసెంబరు30(ఆంధ్రజ్యోతి):ఖమ్మంలో ఆదివారం జరిగిన ఫైన్ ఇండియా అబాకస్ నిర్వహించిన జిల్లాస్థాయి కాంపిటీషన్ పోటీల్లో మండలంలోని సరస్వతి విద్యాలయం విద్యార్థులు ప్రతిభ చాటారు. జిల్లాస్థాయిలో సుమారు 50పాఠశాలలు పాల్గొనగా మొదటి, ద్వితీయ బహుమతులు ఎస్ఎస్‌వీ విద్యార్థులు సాధించారు. సీనియర్ లెవల్ బీ కేటగిరిలో బి.విద్య, సీనియర్ లెవల్ ఫోర్ కేటగిరిలో ఎస్.సహజకృష్ణ మొదటి బహుమతులు సాధించారు. విద్యార్థులను పాఠశాల కరస్పాండెంట్ బానోతు శ్రీనివాస్, ఉపాధ్యాయులు ఎంకోబా,ఎం.గౌతమి, ఉమారాణిఅభినందించారు.



విద్యార్థులను అభినందిస్తున్న యాజమాన్యం

రైతుబజార్ కూరగాయల ధరలు

(కిలో ఒక్కంటికి రూపాయల్లో)

టమాటా	20 రూ.
వంకాయ	28
గుత్తి వంకాయ	40
బీరకాయ	54
పచ్చిమిర్చి	38
కాకరకాయ	48
బెండకాయ	38
పొట్లకాయ	50
దోసకాయ	34-38
చిక్కుడు	48
నాటుచిక్కుడు	78
గోరుచిక్కుడు	48
క్యాబేజీ	24
దొండ	54-60
సొరకాయ	20
క్యారెట్	44
క్యాప్సికం	74
ఆలుగడ్డ	36
ఉల్లిగడ్డ	40-50
కోడిగుడ్ల ట్రే (30 గుడ్లు)	180
కొత్తిమీర కట్ట	25

- ఆంధ్రజ్యోతి, ఖమ్మం మార్కెట్

CINEMA సినిమా

నగరంలో చిత్రాలు..

వినోద:	ముఫాసా
శ్రీనివాస:	మ్యాక్స్
సాయిరాం:	డ్రింకర్‌సాయి/యూఐ
కేపీఎస్:	పుష్ప 2
తిరుమల:	పుష్ప 2
సినీ గెలాక్సీ:	యూఐ

రోడ్లపై కేక్ కటింగ్, డీజేలు పెట్టొద్దు

ఖమ్మంరూరల్ డిసెంబరు30(ఆంధ్రజ్యోతి): నూతన సంవత్సర ఆరంభవేళ ఎవరూ రోడ్లపై కేక్‌కటింగ్, డీజేలు ఏర్పాటు చేయవద్దని, ఇటా ఎవరైనా చేస్తే వారిపై చట్టపరంగా చర్యలు తీసుకుంటామని సీఐ ముష్కరాజు హెచ్చరించారు. డిసెంబరు 31, జనవరి1న రాత్రి వేళ్లలో మద్యంసేవించి వాహనాలు నడిపినా, మైనర్లు డ్రైవింగ్ చేసినా, ఓవర్‌స్పీడ్, ర్యాష్‌డ్రైవింగ్, ఒకే ద్విచక్రవాహనంపై ముగ్గురు ప్రయాణించినా చర్యలు తప్పవన్నారు.

గోశాలకు దాణా వితరణ

ఖమ్మంఖానాపురంహవేలి డిసెంబరు30(ఆంధ్రజ్యోతి):శ్రీస్తంభాద్రి సేవా సమితి ఆధ్వర్యంలో సోమవారం నగరంలోని గొల్లగూడెంలోని ఓమ్ శ్రీకృష్ణ గోశాలకు మార్గశిరమాస బహుళ అమావాస్య తిథి పురస్కరించుకొని దాల్ మిల్ యజమానులు, మొక్కజొన్నల వ్యాపారులు, గోప్రేమికులు దాణా అందజేశారు.సేవాసమితి సభ్యులు ద్వారా సేకరించిన రూ.60,000 దాణాను వితరణగా అందించారు. ఈ కార్యక్రమంలో సేవా సమితి కన్వీనర్ తూములూరి లక్ష్మీనరసింహారావు, సభ్యులు పెనుగొండ శ్రీనివాసరావు, దేవరశెట్టి రామారావు, సూరినేటి మల్లేశం, గజ్జి సూర్యనారాయణ, సేవా సభ్యులు పాల్గొనగా, గోశాల బాధ్యులు ఓం నారాయణ, కేసా హనుమంతరావు తదితరులు పాల్గొన్నారు.



గోశాలకు దాణా అందిస్తున్న దాతలు

పరీక్ష సామగ్రి అందజేత

నేలకొండపల్లి,డిసెంబరు30(ఆంధ్రజ్యోతి): విద్యార్థులు చదువులో ఉన్నత స్థానాలకు ఎగబాకాలని తద్వారా తల్లిదండ్రుల ఆశలను నెరవేర్చాలని చేతన ఫౌండేషన్ సభ్యులు దొడ్డా సీతారామయ్య అన్నారు. చేతన ఫౌండేషన్ ఆధ్వర్యంలో సోమవారం నాచేపల్లి ప్రాథమిక పాఠశాల విద్యార్థులకు స్కూల్ బ్యాగులు, ఉన్నత పాఠశాల విద్యార్థులకు పరీక్ష సామగ్రిని పంపిణీ చేసారు. ఎన్నో ఆశలతో తల్లిదండ్రులు తమ పిల్లలను పాఠశాలలకు పంపుతుంటారని,సమాజంలో పేరు,ప్రతిష్ఠలు తెచ్చుకోవాలని కోరుకుంటారన్నారు. తల్లిదండ్రుల ఆశలను నెరవేర్చటానికి పిల్లలు కృషి చేయాలని కోరారు. కార్యక్రమంలో ఎంఈఓ చలపతిరావు, ముత్తినేని సురేష్, హెచ్ఎం కోటేశ్వరరావు, అమ్మ ఫౌండేషన్ సభ్యులు సైదులు, ఎల్లయ్య పాల్గొన్నారు.



బ్యాగులను పంపిణీ చేస్తున్న చేతన ఫౌండేషన్ సభ్యులు

వైద్యశాలలను బలోపేతం చేయాలి

ఖమ్మంకలెక్టరేట్, డిసెంబరు30 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ హాస్పిటల్స్‌ను బలోపేతం చేయాలని, ప్రైవేటు, కార్పొరేట్ హాస్పిటల్స్ ఫీజుల దోపిడీని అరికట్టాలని కోరుతూ డీఎంహెచ్‌వో మాలతికి ప్రగతిశీల మహిళా సంఘం (పీవోడబ్ల్యు) ప్రగతిశీల యువజన సంఘం (పీవైఎల్) జిల్లా కమిటీలు వినతిపత్రాన్ని అందచేశారు. ఖమ్మం ప్రభుత్వ ప్రధాన ఆసుపత్రి సమస్యలకు నిలయంగా మారిందన్నారు. గైనకాలజీ, న్యూరో సర్జన్, ఎమ్మారై స్కాన్, కార్డియాలజీ సిబ్బందిని నియమించాలన్నారు. వినతిపత్రాన్ని అందించిన వారిలో పీఓడబ్ల్యూ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సీహెచ్ శిరోమణి, పీవైఎల్ జిల్లా అధ్యక్షుడు జె.ప్రేమ్‌సింగ్, టీ ఝాన్సీ, జిల్లా కార్యదర్శి ఆవుల మంగతాయి, జిల్లా సహాయ కార్యదర్శి ప్రతాపనేని శోభ పాల్గొన్నారు.



డీఎంహెచ్‌వోకి వినతిపత్రాన్ని అందిస్తున్న నాయకులు

రేషన్ బియ్యం పట్టివేత

తిరుమలాయపాలెం, డిసెంబరు30(ఆంధ్రజ్యోతి): మండలంలోని అజ్మీర తండా శివారు బొర్రాతండాలో సుమారు వంద క్వింటాళ్ల రేషన్ బియ్యాన్ని మూడు ఇళ్లలో నిల్వ ఉంచారు. ఈసమాచారం తెలుసుకున్న టాస్కుఫోర్సు ఎస్ఐ సురేష్, కిరణ్, ఏఎస్ఐ శ్రీనివాసాచారి, హెడ్‌కానిస్టేబుల్ హరి, తిరుమలాయపాలెం ఎస్ఐ కూసుపుడి జగదీష్ ఆధ్వర్యంలో ఆదివారం తెల్లవారుజామున మూకుమ్మడిగా తనిఖీలు నిర్వహించారు. అక్రమగా నిలవ ఉంచిన 200బస్తాల్లో ఉంచిన వంద క్వింటాళ్ల బియ్యాన్ని పట్టుకుని సివిల్ సప్లయ్ అధికారులకు అప్పగించారు. ఈ అక్రమ రవాణాకు పాల్పడుతున్న బోడ సురేష్, బోడ నరేష్, మరికంటి రామకృష్ణ, శంకర్‌పై కేసు నమోదుచేసి దర్యాప్తు చేస్తున్నారు.



రేషన్‌బియ్యం పట్టుకున్న ఎస్ఐ జగదీష్

డీఈవో కార్యాలయంలో వరద బాధితుల సర్టిఫికెట్లు

ఖమ్మంఖానాపురంహవేలి,డిసెంబరు30 (ఆంధ్రజ్యోతి): సెప్టెంబరులో జిల్లాలో భారీ వరదలకు ముంపుకు గురైన ప్రాంతాల్లో కొందరు విద్యా అర్హత సర్టిఫికెట్లు కోల్పోయారు. ఈ నేపథ్యంలో దరఖాస్తు చేసుకున్న వారికి సంబంధించిన డుప్లికేట్ సర్టిఫికెట్లను జిల్లా విద్యాశాఖ కార్యాలయంలో అందుబాటులో ఉంచారు. ఈ వివరాలు జిల్లా విద్యాశాఖ అధికారి సోమశేఖర శర్మ తెలిపారు. గతంలో నమోదు చేసుకున్న విద్యార్థులు ఒరిజినల్ ఆధార్‌కార్డు, ఒక జీరాక్స్ కాపీతో స్వయంగా వచ్చి తీసుకోవాలని తెలిపారు.

పేదలందరికీ ప్రభుత్వ పథకాలు అందించాలి

» సీపీఎం జిల్లా కార్యదర్శి నున్నా నాగేశ్వరరావు



మాట్లాడుతున్న నున్నా

మధిరరూరల్, డిసెంబరు 30 (ఆంధ్రజ్యోతి): అర్హులైన పేదలందరికీ ప్రభుత్వం పథకాలు అందించాలని సీపీఎం జిల్లా కార్యదర్శి నున్నా నాగేశ్వరరావు డిమాండ్ చేశారు. సోమవారం మధిరలోని బోడేపూడి భవన్‌లో జరిగిన సీపీఎం మధిర డివిజన్ కమిటీ సమావేశంలో ఆయన ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. ప్రభుత్వం ప్రజలకు ఇచ్చిన హామీలను నెరవేర్చడంలో వైఫల్యం చెందిందని విమర్శించారు. రేషన్‌కార్డులు, పింఛన్లు, ఇళ్లు ప్రజలకు కలగానే మిగిలిపోతున్నాయన్నారు. నిరుద్యోగ భృతి, రుణమాఫీ, భూమి లేని పేదలకు ఆర్థికసాయం వంటి వాటిని అమలుచేయకుండా పాలకులు మాటలతోనే కాలం వెళ్లబుచ్చుతున్నారని విమర్శించారు. గ్రామాల్లో పథకాలు అందిస్తామంటూ పార్టీలోకి రావాలని ప్రజలను వత్తిడి చేయడం సరైంది కాదన్నారు. సమావేశంలో సీపీఎం జిల్లా నాయకుడు పొన్నం వెంకటేశ్వరరావు, డివిజన్ కార్యదర్శి మడుపల్లి గోపాలరావు, నాయకులు బండి పద్మ, దొండపాటి నాగేశ్వరరావు, శీలం నర్సింహారావు, మందా సైదులు, పడకంటి మురళి, పెంటి వెంకట్రావ్, దివ్వెల వీరయ్య, మద్దాల ప్రభాకర్ పాల్గొన్నారు.

పదవీ విరమణ సన్మానం

ఖమ్మంలీగల్‌డిసెంబరు30(ఆంధ్రజ్యోతి): స్థానిక ఫ్యామిలీకోర్టులో ముఖ్య పరిపాలనాధికారిగా పనిచేస్తున్న కె.వి.కృష్ణమోహన్ సోమవారం పదవీ విరమణ పొందారు. ఈ సందర్భంగా ఏర్పాటుచేసిన సభకు జిల్లా ప్రధాన న్యాయాధికారి రాజగోపాల్ హాజరై ప్రసంగించారు. న్యాయశాఖలో పనిచేస్తూ మంచిపేరు సంపాదించారని, ఉద్యోగికి పదవీ విరమణ తప్పదని పేర్కొన్నారు. కృష్ణమోహన్ దంపతులను సన్మానించారు. ఈ కార్యక్రమంలో అదనపు జిల్లా న్యాయాధికారి ఉమాదేవి, ఫ్యామిలీకోర్టున్యాయాధికారి అర్చనాకుమారి, న్యాయశాఖ ఉద్యోగులు రాజు, నంచర్ల వెంకటేశ్వర్లు, మధు, సుధాకర్, రవి, వేణు పాల్గొన్నారు.

18 మంది పోలీసు సిబ్బంది అటాచ్‌మెంట్

ఖమ్మంక్రైం డిసెంబరు30(ఆంధ్రజ్యోతి): ఖమ్మం కమిషనరేట్ పరిధిలో విధులు నిర్వహిస్తున్న ముగ్గురు హెడ్ కానిస్టేబుళ్లు, 15 మంది కానిస్టేబుళ్లను సీఎస్బీ విభాగానికి అటాచ్ చేస్తూ పోలీస్ కమిషనర్ సునీల్‌దత్ సోమవారం రాత్రి ఉత్తర్వులు జారీచేశారు. అదే విధంగా అటాచ్‌చేసిన వారిని వెంటనే రిలీవ్ చేయాలని సంబంధిత పోలీస్ అధికారులను ఆదేశించారు.

సాంఘిక శాస్త్ర ప్రతిభా పరీక్ష పోటీలు

ఖమ్మంఖానాపురంహవేలి,డిసెంబరు30 (ఆంధ్రజ్యోతి): జిల్లాసాంఘికశాస్త్ర ఫోరం ఆధ్వర్యంలో మండల స్థాయి సాంఘిక శాస్త్ర ప్రతిభా పరీక్షలు సోమవారం నిర్వహించారు. ఖమ్మం అర్బన్ మండలంలో ప్రభుత్వ జిల్లాపరిషత్ పాఠశాల ఇంగ్లిష్ మీడియం విభాగంలో మొదటి బహుమతి కె.రోషిని జీహెచ్ఎస్ మొమినాన్, ద్వితీయ బహుమతి వర్షిత్ జీహెచ్‌యస్ ఎస్‌సీకాలనీ, తృతీయ బహుమతి ఎండి అయేషా పర్వీన్ జీహెచ్ఎస్ మోమినాన్ సాధించారు. తెలుగు మీడియంలో మొదటి బహుమతి బి.భార్గవి జెడ్పీహెచ్ఎస్ ఖైకొండాయిగూడెం, ద్వితీయ బహుమతి పి.ఉపేందర్ జెడ్పీహెచ్ఎస్ ఇందిరానగర్,తృతీయ బహుమతి ఎస్‌కె సుమ్మయ్య మొమినాన్ గెలుపొందారు. ప్రవేటు స్కూల్ విభాగంలో మొదటి బహుమతి ఏ.సాయి హర్షిత్ విన్‌ఫీల్డ్ పాఠశాల, ద్వితీయ బహుమతి జి.జ్ఞానదీక్షిత రెజోనెన్స్ పాఠశాల, తృతీయ బహుమతి ఎస్.అనికేత్ బ్లూసమస్ పాఠశాల సాధించారు. గురుకుల పాఠశాల విభాగంలో టీజీఎంఆర్ఎస్ విద్యార్థులు విజేతలుగా నిలిచారు. ఖమ్మం అర్బన్ మండల విద్యాశాఖాధికారి శైలజలక్ష్మి,జీహెచ్ఎస్ రికాబ్ బజార్ హెచ్ఎం శాంత, సాంఘిక శాస్త్ర జిల్లా ఫోరం బాధ్యులు బాలకృపానందం, వడ్డే చంద్ర శేఖర్, మండల బాధ్యులు ఉమ, జాలాది సురేష్, సాంఘికశాస్త్ర ఉపాధ్యాయులు బహుమతులు అందించారు. విజేతలు జనవరి4న జరుగు జిల్లా స్థాయి పోటీలకు హాజరు కావాలని చెప్పారు.

నేలకొండపల్లి: విద్యార్థుల్లో దాగి ఉన్న సృజనాత్మకతను, ప్రతిభను వెలికితీయటానికి టాలెంట్ టెస్టులు ఉపయోగపడతాయని మండల విద్యాధికారి చలపతిరావు అన్నారు. నేలకొండపల్లిలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో సోమవారం రాష్ట్ర సాంఘీక శాస్త్ర టీచర్స్ ఫోరం ఆధ్వర్యంలో నిర్వహించిన మండల స్థాయి టాలెంట్ టెస్టును ఎంఈఓ చలపతిరావు ప్రారంభించారు. టాలెంట్ టెస్టుల్లో పాల్గొనటం ద్వారా విద్యార్థుల్లో ఆత్మవిశ్వాసం పెరుగుతుందని, తద్వారా వారిలో పట్టుదల పెరుగుతాయన్నారు. అనంతరం టాలెంట్ టెస్టులో ప్రతిభ కనపర్చిన విద్యార్థులకు సర్టిఫికెట్లు ప్రదానం చేశారు. కార్యక్రమంలోబి.ప్రసాద్,డి.గోవిందరెడ్డి, నాగుల్‌మీరా, పి.రామారావు, నవాబ్‌సాహెబ్, సునీత, ఝాన్సీ తదితరులు పాల్గొన్నారు.





ఖమ్మంలో గెలుపొందిన విద్యార్థులతో ఉపాధ్యాయులు, నేలకొండపల్లిలో సర్టిఫికెట్లు అందజేస్తున్న ఎంఈఓ చలపతిరావు

'తొలితరం తెలంగాణ ఉద్యమకారులను ఆదుకోవాలి'



మధిర తహసీల్దార్ కార్యాలయ అధికారికి వినతి పత్రం ఇస్తున్న నాయకులు

మధిర, డిసెంబరు 30 (ఆంధ్రజ్యోతి): తొలితరం తెలంగాణ ఉద్యమకారులను గుర్తించి ఆదుకోవాలని ప్రభుత్వాన్ని కోరుతూ పలువురు నాయకులు సోమవారం ప్రజావాణిలో తహసీల్దార్‌కు వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ 1969లో మధిర నుంచి తెలంగాణ ఉద్యమంలో పాల్గొన్న నాయకులను గుర్తించి గుర్తింపు కార్డులు ఇవ్వాలని, ఉద్యమకారులకు ఇచ్చే రాయితీ లు కల్పించాలని తదితర తమ సమస్యలను వివరిస్తూ డిప్యూటీ సీఎంను అడ్రస్ చేస్తూ వినతి పత్రం అందజేశారు. ఈకార్యక్రమంలో పుతుంబాక శ్రీకృష్ణ ప్రసాద్, రిటైర్డ్ ఉద్యోగి ఎండీ ఖాసీం, రమావత్ బాబూరావు, బాహటం సుబ్బరాజు, ఎలగందుల రాధాకృష్ణ, అవధానుల బాస్కర్, వెల్లంకి రాజేంద్రప్రసాద్, దోసపాటి వెంకట నాగ సోమేశ్వరరావు, కుందా వెంకటనారాయణ, టీవీరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

వ్యవసాయ కూలీలకు భరోసా కల్పించాలి

వైరా, డిసెంబరు 30 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వం వ్యవసాయ కూలీలకు ఇస్తామని ప్రకటించిన భరోసాకు ఉపాధి హామీ పథకాన్ని అనుసంధానం చేసే ఆలోచనను ఉపసంహరించుకోవాలని తెలంగాణ రైతుసంఘం జిల్లా కార్యదర్శి బొంతు రాంబాబు డిమాండ్ చేశారు. వైరా మునిసిపాలిటీ పదోవార్డు గండగలపాడులో ఆదివారం రాత్రి నిర్వహించిన కిన్నెర రాఘవులు వర్ధంతి సభలో ఆయన మాట్లాడారు. రాష్ట్ర ప్రభుత్వం గ్రామ, వార్డు సభల ద్వారా కూలీలను గుర్తించాలని డిమాండ్ చేశారు. భూమి ఉంటే కూలీ భరోసా నిరాకరించే విధానం సరికాదన్నారు. అరకొర భూమి ఉండి కూలీపై ఆధారపడి జీవించే కుటుంబాలను ప్రభుత్వం నమోదు చేయాలని అన్నారు. వైరా మునిసిపాలిటీ పరిధిలో ఉన్న కూలీలకు ఈజీఎస్ పని ఎత్తివేసి మొండిచెయ్యి చూపడాన్ని తీవ్రంగా ఖండించారు. మునిసిపాలిటీలోని కూలీలకు భరోసా కల్పించాలని కోరారు. పల్లెబోయిన కృష్ణ, కిన్నెర మోతి, మల్లెంపాటి రామారావు, వాసిరెడ్డి విద్యాసాగర్‌రావు, గుమ్మా నర్సింహారావు, ఇమ్మడి సుధీర్, శ్రీనివాసరావు పాల్గొన్నారు.

ఇందిరమ్మ ఇళ్ల సర్వేను

వేగవంతం చేయాలి

» డీపీవో ఆశాలత

ముదిగొండ, డిసెంబరు 30 (ఆంధ్రజ్యోతి): ఇందిరమ్మ ఇళ్ల సర్వేను వేగవంతంగా పూర్తిచేయాలని జిల్లా పంచాయతీ అధికారి ఆశాలత ఆదేశించారు. సోమవారం ముదిగొండ మండలం వల్లభి, బాణాపురం గ్రామాల్లో ఆమె పర్యటించి సర్వే ప్రక్రియను పరిశీలించారు. ఎలాంటి తప్పులు దొర్లకుండా ఆన్‌లైన్‌లో నమోదు చేయాలని సూచించారు. దరఖాస్తు చేసుకున్న ప్రతి కుటుంబాన్ని సర్వే నిర్వహించాలన్నారు. కార్యక్రమంలో ఎంపీవో వాల్మీకి కిషోర్ పాల్గొన్నారు.



సర్వే ప్రక్రియను పరిశీలిస్తున్న డీపీవో ఆశాలత

అసంపూర్తిగా గిరిజన భవన నిర్మాణం

» భవనాన్ని త్వరగా పూర్తి చేసి వినియోగంలోకి తీసుకురావాలని వినతి



వైరా, డిసెంబరు 30 (ఆంధ్రజ్యోతి): వైరాలో దాదాపు ఐదేళ్ల కిందట మొదలుపెట్టిన గిరిజన భవన నిర్మాణం నేటికీ అసంపూర్తిగానే మిగిలిపోయింది. గిరిజనుల నివాసాలకు దూరంగా వారికి ఏమాత్రం సంబంధం లేని స్థలంలో ఈ భవన నిర్మాణాన్ని చేపట్టారు. స్థానిక ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయం పక్కనే నీటిపారుదలశాఖ స్థలంలో రూ.కోటితో ఈ భవన నిర్మాణాన్ని ప్రారంభించారు. గిరిజనుల నివాసాలకు ఈ భవన నిర్మాణ ప్రాంతం దాదాపు కిలోమీటర్ దూరానికిపైగా ఉంది. గిరిజనులకు అందుబాటులో ఉన్న ఎన్నెస్పీ కానీ లేక ఇతర ప్రభుత్వ స్థలాల్లో ఈ భవనాన్ని నిర్మించినట్లయితే వారికి ఎంతో ఉపయోగకరంగా ఉండేది. అయితే ఇక్కడి ప్రజాప్రతినిధులు, గిరిజనశాఖ అధికారుల అనాలోచిత నిర్ణయాల కారణంగా ఈభవనం గిరిజనులకు అంతగా ఉపయోగపడే పరిస్థితులు లేవనే చర్చ కూడా ఉంది. ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయం పక్కనే నత్తనడకను తలపిస్తూ అసంపూర్తిగా ఉన్న ఈ భవన నిర్మాణాన్ని పూర్తిచేసే విషయంలో ఐటీడీఏ ఇంజనీరింగ్ అధికారులు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారనే విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. గిరిజనులు ఇక్కడ వివాహాలు ఇతర శుభ కార్యక్రమాలు, అనేక సామూహిక కార్యక్రమాలను నిర్వహించుకొనేందుకు వీలుగా ఈ భవన నిర్మాణాన్ని చేపట్టారు. పాత లంబాడా తండాకు సమీపంలోని రైతువేదిక వద్ద ఈ గిరిజన భవనాన్ని నిర్మించి అక్కడున్న రైతు వేదికను ప్రస్తుతం నిర్మిస్తున్న గిరిజన భవన స్థానంలో చేపట్టినట్లయితే గిరిజనులకు, రైతులకు ఈ రెండు చోట్ల ఎంతో సౌకర్యంగా ఉండేవని ఆ రెండువర్గాల వారు పేర్కొంటున్నారు. ఇప్పుడు నిర్మించిన రైతువేదిక వైరా క్లస్టర్ రైతులకు అందుబాటులో లేకుండా అసౌకర్యంగా ఉంది. ఇప్పటికైనా ఎమ్మెల్యే మాలోతు రాందాస్‌నాయక్, ఐటీడీఏ అధికారులు తగు చర్యలు తీసుకొని ఈగిరిజన భవనాన్ని త్వరితగతిన పూర్తిచేసి ఉపయోగంలోకి తీసుకురావాలని కోరుతున్నారు.

మిరపపంటలో సస్యరక్షణ చర్యలు చేపట్టాలి: ఏడీఏ

ఎర్రుపాలెం, డిసెంబరు30(ఆంధ్రజ్యోతి): మిరప పంటలలో సస్యరక్షణ చర్యలు చేపట్టాలని ఏడీఏ విజయచంద్ర అన్నారు. ఆదివారం మండలంలోని గట్లగౌరారం గ్రామంలో మిరప పంటలను పరిశీలించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రస్తుతం మిర్చి పంటలలో రసం పీల్చే పురుగులు, పొగాకు లద్దెపురుగులను గమనించామన్నారు. వాటి నివారణకు ఇమిడాక్లోప్రిడ్ 0.3-0.4 మిల్లీ, ఏసీపేట 1.5 గ్రాములు లీటరు నీటికి కలిపి పిచికారి చేయాలని రైతులకు సూచించారు. దీంతో పాటు పసుపు, నీలిరంగు జిగురు అట్టలను ఎకరానికి 20నుంచి 25 అమర్చినట్టయితే రసం పీల్చే పురుగును పూర్తిగా నివారించుకోవచ్చన్నారు. రైతులు ఎప్పటికప్పుడు పైరును గమనించుకుని సస్యరక్షణ చర్యలు చేపట్టినట్లయితే చీడపీడల నుంచి బయటపడే అవకాశం ఉందన్నారు. మధిర డివిజన్ పరిధిలో తాను ఎప్పుడు అందుబాటులో ఉంటానని తెలిపారు. ఈకార్యక్రమంలో ఏఈవో వంశీకృష్ణ, రైతులు పాల్గొన్నారు.



రైతులతో మాట్లాడుతున్న ఏడీఏ విజయచంద్ర

పేదలందరికీ ప్రభుత్వ పథకాలు అందించాలి

» సీపీఎం జిల్లా కార్యదర్శి నున్నా నాగేశ్వరరావు

మధిర రూరల్, డిసెంబరు 30 (ఆంధ్రజ్యోతి): అర్హులైన పేదలందరికీ ప్రభుత్వం పథకాలు అందించాలని సీపీఎం జిల్లా కార్యదర్శి నున్నా నాగేశ్వరరావు డిమాండ్ చేశారు. సోమవారం మధిరలోని బోడేపూడి భవన్‌లో జరిగిన సీపీఎం మధిర డివిజన్ కమిటీ సమావేశంలో ఆయన ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. ప్రభుత్వం ప్రజలకు ఇచ్చిన హామీలను నెరవేర్చడంలో వైఫల్యం చెందిందని విమర్శించారు. రేషన్‌కార్డులు, పింఛన్లు, ఇళ్ల ప్రజలకు కలగానే మిగిలిపోతున్నాయన్నారు. నిరుద్యోగ భృతి, రుణమాఫీ, భూమి లేని పేదలకు ఆర్థికసాయం వంటి వాటిని అమలుచేయకుండా పాలకులు మాటలతోనే కాలం వెళ్లబుచ్చుతున్నారని విమర్శించారు. గ్రామాల్లో పథకాలు అందిస్తామంటూ పార్టీలోకి రావాలని ప్రజలను వత్తిడి చేయడం సరైంది కాదన్నారు. సమావేశంలో సీపీఎం జిల్లా నాయకుడు పొన్నం వెంకటేశ్వరరావు, డివిజన్ కార్యదర్శి మడుపల్లి గోపాలరావు, నాయకులు బండి పద్మ, దొండపాటి నాగేశ్వరరావు, శీలం నర్సింహారావు, మందా సైదులు, పడకంటి మురళీ, పెంటి వెంకట్రావ్, దివ్వెల వీరయ్య, మద్దాల ప్రభాకర్ పాల్గొన్నారు.



మాట్లాడుతున్న నాగేశ్వరరావు

ప్రశాంతంగా నూతన సంవత్సర

వేడుకలను జరుపుకోవాలి: సీఐ కిరణ్

సత్తుపల్లిరూరల్, డిసెంబరు 30 (ఆంధ్రజ్యోతి): నూతన సంవత్సర వేడుకలను ప్రశాంత వాతావరణంలో జరుపుకోవాలని సత్తుపల్లి పట్టణ సీఐ టీ.కిరణ్ అన్నారు. సోమవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ ఎవరైనా కష్టాల్లో ఉన్నప్పుడు డయల్ 100కు కాల్ చేయాలని సూచించారు. అనుమానాస్పద వ్యక్తులు కనిపిస్తే సమాచారం ఇవ్వాలని కోరారు. నూతన సంవత్సరం సందర్భంగా ఈరోజు, రేపు పట్టణంలో జరిగే న్యూ ఇయర్ వేడుకలు స్పతిమించవద్దన్నారు. మద్యం సేవించి వాహనాలు నడిపితే శిక్షలు తప్పవన్నారు.

ఏన్కూరు, డిసెంబరు30(ఆంధ్రజ్యోతి): మండలంలో ఈనెల 31న మంగళవారం రాత్రి డ్రంకెన్ డ్రైవ్ నిర్వహిస్తున్నట్టు ఎస్ఐ రఫి తెలిపారు. సోవారం విలేకరులతో మాట్లాడుతూ నూతన సంవత్సరం వేడుకలను ప్రశాంతంగా జరుపుకోవాలని అన్నారు.

ప్రీ స్కూల్‌పై దృష్టి సారించండి : సీడీపీవో

సత్తుపల్లిరూరల్, డిసెంబరు 30 (ఆంధ్రజ్యోతి): అంగన్‌వాడీ కేంద్రాలలో ప్రీ స్కూల్ విద్యపై దృష్టి సారించాలని ఐసీడీఎస్ సీడీపీవో కనకదుర్గ కోరారు. సోమవారం అయ్యగారిపేట సెక్టార్ పరిధిలోని పలు అంగన్‌వాడీ కేంద్రాలను ఆమె తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ప్రీ స్కూల్ విద్యపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ట్రైనింగ్ బ్లాక్ కో-ఆర్డినేటర్ ప్రసాద్, సూపర్‌వైజర్ మహాలక్ష్మి, టీచర్లు రహీమున్నీసా, స్వాతి, సర్వేశ్వరి, సుజాత, భారతిలు పాల్గొన్నారు.

'పంచాయతీ ఎన్నికలకు సన్నద్ధం కావాలి'

మధిర రూరల్, డిసెంబరు 30 (ఆంధ్రజ్యోతి): జరగబోయే గ్రామపంచాయతీ ఎన్నికల్లో క్లీన్‌స్వీప్ చేసి గ్రామాల్లో కాంగ్రెస్ పార్టీ సత్తా చాటాలని మండల కాంగ్రెస్ అధ్యక్షుడు సూరంశెట్టి కిషోర్ పిలుపునిచ్చారు. సోమవారం మధిర మండలం మాటూరు గ్రామంలో జరిగిన కాంగ్రెస్ కార్యకర్తల సమావేశంలో ఆయన మాట్లాడారు. కాంగ్రెస్ ప్రభుత్వం రైతు, పేద వర్గాల అభివృద్ధే ధ్యేయంగా పలు పథకాలను ప్రవేశపెట్టిందని తెలిపారు. డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క మధిర నియోజకవర్గాన్ని అన్ని రంగాల్లో అభివృద్ధి పథకంలో నిలుపుతున్నారని, నియోజకవర్గ అభివృద్ధికి వందలకోట్లు తీసుకువస్తున్నారన్నారు. ప్రభుత్వ పథకాలను ప్రజల్లో విస్తృతంగా ప్రచారం చేయాలన్నారు. జరగబోయే గ్రామపంచాయతీ ఎన్నికల్లో అన్నివార్డుల్లో ఘనవిజయం సాధించాలన్నారు. కార్యక్రమంలో నాయకులు కర్నాటి రామారావు, దారా బాలరాజు, దుంపా వెంకటేశ్వర్‌రెడ్డి, ఇటికాల కృష్ణారావు, చిలివేరు బుచ్చిరామయ్య, పులిబండ్ల చిట్టిబాబు, కొంగల ప్రసాద్ పాల్గొన్నారు.

3న బహిరంగ వేలం పాట

ఏన్కూరు, డిసెంబరు30(ఆంధ్రజ్యోతి): గార్లొడ్డు శ్రీ లక్ష్మీనర్సింహాస్వామి దేవాలయ ప్రాంగణం నందు లడ్డూ ప్రసాదం పులిహోర విక్రయించేందుకు జనవరి 3వతేదీ శుక్రవారం బహిరంగ వేలం పాట నిర్వహిస్తున్నట్టు ఆలయ ఈవో ఎస్‌వీడీ ప్రసాద్ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 11గంటలకు దేవాదాయ కమిషనర్ ఖమ్మం కార్యాలయం నందు ఈ వేలం నిర్వహించనున్నట్లు తెలిపారు. వివరాలకు ఆలయ ఈవోను సంప్రదించాలని కోరారు.

బాధిత కుటుంబాలను పరామర్శించిన లింగాల కమల్‌రాజ్



శ్రీనివాసరావును పరామర్శిస్తున్న కమల్‌రాజ్

మధిర రూరల్, డిసెంబరు 30 (ఆంధ్రజ్యోతి): మండలంలోని చిలుకూరు, సిరిపురం గ్రామాల్లో సోమవారం మాజీ జడ్పీచైర్మన్ లింగాల కమల్‌రాజ్ పర్యటించారు. చిలుకూరులో బీఆర్ఎస్ నాయకుడు నిడమానూరి శ్రీనివాసరావు అనారోగ్యానికి గురికావడంతో ఆయనను పరామర్శించారు. అలాగే సిరిపురంలో సాధినేని కిరణ్ మాతృమూర్తి మృతి చెందడంతో వారి కుటుంబాన్ని పరామర్శించారు. కార్యక్రమంలో చిత్తారు నాగేశ్వరరావు, చావా వేణు, బొగ్గుల భాస్కర్‌రెడ్డి, కూనా నరేందర్‌రెడ్డి, నాగబాబు, అయిలూరి ఉమామహేశ్వర్‌రెడ్డి పాల్గొన్నారు.

బీమా నగదు అందజేత



బీమా నగదు అందిస్తున్న సొసైటీ అధ్యక్షుడు సాంబశివరావు

ఎర్రుపాలెం, డిసెంబరు30(ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలోని ఎర్రుపాలెంలోని డీసీసీబీ బ్యాంక్‌లో అయ్యవారిగూడెం వ్యవసాయ సహకార సంఘం ఆధ్వర్యంలో సభ్యుడు బీమా నగదును సోమవారం అందించారు. సొసైటీ పరిధిలో మామునూరు గ్రామానికి చెందిన షేక్ చిన్న మహబూబ్ సుభాని ఇటీవల అనారోగ్యంతో మృతి చెందాడు. సుభానికి సహకార సంఘంలో సభ్యత్వం ఉండడంతో ప్రభుత్వం నుంచి మంజూరైన రూ.50వేల బీమా నగదును ఆయన భార్య షేక్ ఆయేషాకి సొసైటీ అధ్యక్షుడు అనుమోలు సాంబశివరావు, డీసీసీబీ మేనేజర్ దివ్య అందించారు. ఈసందర్భంగా సాంబశివరావు మాట్లాడుతూ సంఘ సభ్యుడైన షేక్ చిన్న మహబూబ్ సుభాని మృతి బాధాకరమన్నారు. ఈకార్యక్రమంలో అసిస్టెంట్ మేనేజర్ సుధాకర్, క్యాషియర్ మౌనిక, జాని, సీఈవో మోహన్‌రావు, సొసైటీ సిబ్బంది మురళి, రమణరెడ్డి పాల్గొన్నారు.

ప్రజావాణికి కీలక అధికారుల డుమ్మా

» హాజరుకాని అధికారులకు షోకాజ్ నోటీసులు జారీ చేసిన ఆర్డీవో



ప్రజావాణిలో అధికారులతో మాట్లాడుతున్న ఆర్డీవో రాజేంద్రగౌడ్

కల్లూరు, డిసెంబరు30(ఆంధ్రజ్యోతి): కల్లూరులో సోమవారం తహసీల్దార్ కార్యాలయంలో జరిగిన ప్రజావాణిలో కీలక అధికారులు డుమ్మా కొట్టారు. మండల స్థాయిలో జరిగిన ప్రజావాణికి ప్రతి వారం ప్రభుత్వ తరుపున ఆయాశాఖల తరుపున ప్రధాన అధికారులు తప్పని సరిగా హాజరు కావాల్సి ఉంది. ప్రభుత్వ నిబంధనలను సైతం ధిక్కరించి కీలక అధికారుల రాకుండా తమ కింది స్థాయిలో అటెండర్, సూపర్‌వైజర్ హోదా గల ఉద్యోగులను తమ శాఖల తరుపున ప్రతినిధులుగా పంపడంతో కల్లూరులో జరిగే ప్రజావాణికి స్పందన కరువైంది. ప్రజలు పలు శాఖలకు సంబంధించిన సమస్యలను విన్నవించుకుందామని వస్తే అంతిమంగా కీలక అధికారులు డుమ్మా కొట్టడంతో ఇక తమ సమస్యలను ఎవరికీ తెలియ పరచాలో అర్థం కాని పరిస్థితి.

మండల స్థాయిలో ప్రతి సోమవారం జరిగే ప్రజావాణికి ఆయా శాఖల తరుపున కీలక అధికారులు తప్పని సరిగా హాజరు కావాలని రాష్ట్ర ప్రభుత్వం ఆదేశించినా, కల్లూరు మండల తహసీల్దార్ కార్యాలయంలో జరిగే గ్రీవెన్స్ డే అధికారులందరూ గైర్హాజరు కావడం పలు విమర్శలకు తావిస్తుంది. మండల స్థాయిలో ఎంపీడీవో, ఎంపీవో, విద్యాశాఖ తరుపున ఎంఈవో, వైద్యాశాఖ తరుపున వైద్యాధికారులు, పశువైద్య శాఖ తరుపున వైద్యాధికారి, జలవనరులశాఖ, ఐకేపీ తదితర శాఖల అధికారులు గత అనేక వారాల నుంచి డుమ్మా కొడుతున్నారని తెలిసింది. తమ ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తూ తమ కింది స్థాయి ఉద్యోగులను పంపిస్తే ఇక ప్రజలు అందించిన దరఖాస్తులపై జవాబుదారి తనం ఎలా వస్తుందని స్థానిక ప్రజలు ప్రశ్నిస్తున్నారు.

మండల తహసీల్దార్ కార్యాలయంలో జరుగుతున్న ప్రజావాణి కార్యక్రమాన్ని ఆర్డీవో ఎల్. రాజేంద్రగౌడ్ తనిఖీ చేశారు. ప్రజావాణిలో డుమ్మా కొట్టిన విద్యాశాఖ అధికారికి, ప్రజా, పశువైద్యాధికారులకు ఆర్డీవో షోకాజ్ నోటీసులు జారీ చేస్తూ వారికి అందజేయాలని ఆయన తహసీల్దార్‌ను ఆదేశించారు. తమ సొంత శాఖల పని ఉందని సాకులు చెప్పి హాజరుకాకపోతే ఇకపై ఉపేక్షించేది లేదని ఆర్డీవో హెచ్చరించారు. ఇకపై అధికారులు తప్పనిసరిగా ప్రజావాణి కార్యక్రమానికి హాజరుకావాలని ఆదేశించారు.

'సాటిమనిషికి సాయం చేద్దాం'



వృద్ధులకు చీరెలు అందిస్తున్న సుధారాణి

సత్తుపల్లిరూరల్, డిసెంబరు 30 (ఆంధ్రజ్యోతి): కష్టాలలో ఉన్న సాటిమనిషికి అవకాశం ఉన్నంతవరకు సాయం చేద్దామని అనువంశిక వైద్యురాలు సుధా కొనకళ్ల అన్నారు. నూతన సంవత్సరానికి స్వాగతం పలుకుతూ సుధా ఛారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో సోమవారం పట్టణంలోని గుడిపాడుకు చెందిన వృద్ధ వితంతువులకు చీరెలను ఉచితంగా పంపిణీ చేశారు. ప్రతి కొత్త సంవత్సరంలో పేదలకు సాయం చేసే కార్యక్రమాలు నిర్వహించడం ఆనందంగా ఉందన్నారు.

రోడ్డు ప్రమాదాల్లో ఐదుగురికి గాయాలు

సత్తుపల్లిరూరల్, డిసెంబరు 30 (ఆంధ్రజ్యోతి): సత్తుపల్లి పట్టణ శివారుల్లో సోమవారం రెండు చోట్ల వేర్వేరుగా రోడ్డు ప్రమాదాలు చోటుచేసుకున్నాయి. సింగరేణి వైజంక్షన్ వద్ద రెండు లారీలు ఎదురెదురుగా ఢీకొనడంతో ఇద్దరు డ్రైవర్లు స్వల్పగాయాలతో బయటపడ్డారు. అదేవిధంగా వైజాగ్ నుంచి వరంగల్ వైపు వెళ్తున్న కారు ఫైఓవర్ వద్దకు రాగానే అతివేగంతో అదుపుతప్పి డివైడర్‌ను ఢీకొంది. ఈ ప్రమాదంలో కారు రోడ్డుపై బోల్తా కొట్టగా అందులోని ముగ్గురు స్వల్ప గాయాలయ్యాయి. పోలీసులు రెండు ప్రాంతాల్లో ట్రాఫిక్‌ను క్రమబద్ధీకరించారు.

తల్లాడలో ఇద్దరికి తీవ్రగాయాలు

తల్లాడ, డిసెంబరు 30 (ఆంధ్రజ్యోతి): మండలంలోని అంబేద్కర్‌నగర్ వద్ద సోమవారం కారు, లారీ ఢీకొన్నాయి. ఈ ప్రమాదంలో కారులో ప్రయాణిస్తున్న ఇద్దరికి తీవ్రగాయాలయ్యాయి. హైదరాబాద్ నుంచి అశ్వారావుపేట మండలం తిరుమలకుంట వైపు వెళ్తున్న కారు, తల్లాడ నుంచి వైరా వైపు వస్తున్న లారీ ఢీకొన్నాయి. ఈ ప్రమాదంలో కారులో ప్రయాణిస్తున్న తిరుమలకుంటకు చెందిన కె.నాగేశ్వరరావు, డ్రైవర్ కె.రాజుకు తీవ్రగాయాలయ్యాయి. 108వాహనంలో క్షతగాత్రులను చికిత్స కోసం ఖమ్మంలోని ఓ ప్రైవేట్ హాస్పిటల్‌కు తరలించారు.

క్రమశిక్షణతో శిక్షణ పూర్తిచేయాలి

సత్తుపల్లి, డిసెంబరు 30 (ఆంధ్రజ్యోతి): స్వయం ఉపాధి కోసం సింగరేణి ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ఉచిత వృత్తి శిక్షణను సద్వినియోగం చేసుకోవాలని సింగరేణి సేవా సమితి అధ్యక్షురాలు జీ.మధురవాణి షాలెంరాజు కోరారు. సోమవారం స్థానిక ఐకేపీ భవనంలో మహిళలకు కంప్యూటర్ కోర్స్, టైలరింగ్ కోర్స్, మగ్గం ఫ్యాషన్ డిజైనింగ్ కోర్సులను ఆమె ప్రారంభించారు. శిక్షణ పొందిన వారికి పరీక్షలు నిర్వహించి ఉత్తీర్ణులైన వారికి సర్టిఫికేట్లు ఇవ్వనున్నట్లు చెప్పారు. క్రమశిక్షణతో శిక్షణ పూర్తి చేయాలని అన్నారు. కార్యక్రమంలో కౌన్సిలర్ కంటే నాగలక్ష్మి, జేవీఆర్ ఓసీ సీనియర్ పీవో కే.దేవదాస్, సభ్యులు భవానీ రవీందర్, సీహెచ్.సాగర్ తదితరులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న మధురవాణిషాలెంరాజు

పీఆర్టీయూ క్యాలెండర్ అవిష్కరణ

కారేపల్లి డిసెంబరు30(ఆంధజ్యోతి): మండల కేంద్రంలో సోమవారం పీఆర్టీయూ ఉపాధ్యాయ సంఘం క్యాలెండర్‌ను ఆ సంఘం నాయకులు అవిష్కరించారు. ఈకార్యక్రమంలో ఎంఈవో డి.జయరాజ్, నోడల్ అధికారి కె.శ్రీనువాస్‌రావు, మండల సంఘం అధ్యక్షుడు బాలిన వెంకటరెడ్డి, ప్రధాన కార్యదర్శి వాంకుడోత్ మంగీలాల్, సాల్మన్‌రాజ్, కనకరాజ్, నరింహ, సాధిక్‌పాషా తదితరులు పాల్గొన్నారు.

చింతకాని రైల్వే స్టేషన్‌లో యాచకుడి మృతి

చింతకాని, డిసెంబరు 30(ఆంధ్రజ్యోతి): చింతకాని రైల్వే స్టేషన్‌లో గుర్తు తెలియన వ్యక్తి సోమవారం మృతి చెందాడు. రైల్వే ఎస్ఐ భాస్కర్‌రావు తెలిపిన వివరాల ప్రకారం.. మృతుడు యాచకుడని, నెల రోజులుగా చింతకాని రైల్వే స్టేషన్, పరిసర ప్రాంతాల్లో ఉంటూ భిక్షాటన చేస్తు అనారోగ్యంతో మృతి చెందినట్లు తెలిపారు. మృతుని వివరాలు తెలియాల్సి ఉందన్నారు. అన్నం ఫౌండేషన్‌కు సమాచారం ఇవ్వడంతో ఘటనా స్థలానికి చేరుకున్న అన్నం శ్రీనివాసరావు బృందం మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ఖమ్మం ప్రభుత్వ ఆసుపత్రికి తరలించినట్లు తెలిపారు.

బత్తులపల్లిలో పశువైద్య శిబిరం

కల్లూరు, డిసెంబరు 30 (ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని బత్తులపల్లి గ్రామంలో సోమవారం నిర్వహించిన పశువైద్య శిబిరం విజయవంతమైంది. ఈ శిబిరాన్ని మండల పశువైద్యాధికారి మమత ప్రారంభించారు. ఈ శిబిరంలో గర్భకోశ వ్యాధులకు సంబంధించి పశువులకు వైద్య చికిత్స, దూడలకు నట్టల నివారణ మందులు తాగించారు. ఈ కార్యక్రమంలో వీఎల్ఏ శ్రీనివాసరావు, గోపాలమిత్ర సూపర్‌వైజర్ టి. వెంకటేశ్వర్లు, నాగిరెడ్డి, కె. అప్పారావు, కృష్ణప్రసాద్, వెంకటేశ్వర్లు, విజయ్‌కుమార్ రైతులు పాల్గొన్నారు.

తల్లాడలో గ్రీవెన్స్‌కు 19దరఖాస్తులు

తల్లాడ, డిసెంబరు 30 (ఆంధ్రజ్యోతి): తల్లాడ రెవెన్యూ కార్యాలయంలో సోమవారం నిర్వహించిన గ్రీవెన్స్‌కు 19దరఖాస్తులు వచ్చాయి. మండలంలోని వివిధ గ్రామాలకు చెందిన ప్రజలు పలు సమస్యలపై అధికారులకు దరఖాస్తులు అందజేశారు. కార్యక్రమంలో తహసీల్దార్ ఏ.వనజ, ఎంఈవో ఎన్.దామోదర్‌ప్రసాద్, ఎన్‌పీడీసీఎల్ ఏఈ దారా ప్రసాద్, ఎన్నెస్పీ ఏఈ శ్రీనివాసరెడ్డి పాల్గొన్నారు.

టాలెంట్ టెస్టులో విద్యార్థుల ప్రతిభ

మధిర, డిసెంబరు30(ఆంధ్రజ్యోతి): మధిరలోని టీవీఎం హైస్కూల్‌లో తెలంగాణ స్టేట్ సోషల్ సైన్స్ టీచర్స్ ఫోరం ఆధ్వర్యంలో సోమవారం విద్యార్థులకు టాలెంట్ టెస్ట్ నిర్వహించారు. ఈటెస్ట్‌లో ప్రథమ, తృతీయ బహుమతులు భరత్ టెక్నోస్కూల్ విద్యార్థులు, శీలం రాజశేఖర్‌రెడ్డి, చలువాది శైలేఎలు గెలుపొందారు. ద్వితీయ బహుమతిని సెయింట్ ఫ్రాన్సిస్ స్కూల్ విద్యార్థి కె హరిదీప్ గెలుపొందాడు. వీరిని అభినందిస్తూ ఎంఈవో వై ప్రభాకర్, పూర్వ విద్యార్థి సంఘం నాయకులు పుతుంబాక శ్రీకృష్ణప్రసాద్, మాధవరపు నాగేశ్వరరావు బహుమతులు, ప్రశంసాపత్రాలు అందజేశారు.

పెనుబల్లిలో..

పెనుబల్లి, డిసెంబరు 30(ఆంధ్రజ్యోతి): తెలంగాణ సోషల్ టీచర్స్ ఫోరం ఖమ్మం జిల్లా ఆధ్వర్యంలో నిర్వహించిన మండల స్థాయి టాలెంట్ టెస్టులో లక్ష్య టాలెంట్ స్కూల్ విద్యార్థులు ప్రథమ, తృతీయ ర్యాంకులు సాధించారు. బొర్రా క్రాంతి చరిత ప్రథమస్థానం, గుంజ్యా భానుప్రకాష్ తృతీయ స్థానం సాధించారు. విద్యార్థులను ఎంఈవో సత్యనారాయణ అభినందించారు. కార్యక్రమంలో నిర్వాహకులు వాసం వెంకటేశ్వరరావు, సోమ్లానాయక్, వనమా నాగేశ్వరరావు, జి.హన్మంతు, వీవీ.రామమూరావు పాల్గొన్నారు.

వైరాలో...

వైరా, డిసెంబరు30(ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులు ప్రైవేట్ విద్యాసంస్థల విద్యార్థుల కంటే మిన్నగా ప్రతిభా పాటవాలు కల్గి ఉన్నారని అందుకు సాంఘిక శాస్త్ర ఉపాధ్యాయుల కృషి అభినందనీయమని వైరా ఎంఈవో కొత్తపల్లి వెంకటేశ్వర్లు పేర్కొన్నారు. మండలస్థాయిలో జరిగిన సాంఘిక శాస్త్ర టాలెంట్‌టెస్టులో బహుమతులు సాధించిన విద్యార్థులను సోమవారం ఎంఈవో అభినందించారు. మండల నోడల్ అధికారి జి.మాధవరావు, సోషల్ ఫోరం కన్వీనర్ కృష్ణ, శిరీష, వి.వెంకటేశ్వర్లు, ఉపాధ్యాయులు గాయత్రి, భాగ్యలక్ష్మి, దొడ్డా వరప్రసాదరావు, వెంకటరత్నం పాల్గొన్నారు.



పెనుబల్లిలో విజేతలకు ప్రశంసాపత్రాలు అందజేస్తున్న నిర్వాహకులు

బోనకల్‌లో...

బోనకల్, డిసెంబరు 30(ఆంధ్రజ్యోతి): బోనకల్ ఉన్నత పాఠశాలలో సోమవారం సోషల్ ఫోరం ఆధ్వర్యంలో నిర్వహించిన మండలస్థాయి టాలెం ట్ టెస్టులో మోటమర్రి విద్యార్థి కుంచం వంశీకృష్ణ తెలుగు మీడియంలో ప్రథమస్థానంలో నిలిచాడు. ఇంగ్లీషు మీడియంలో ముష్టికుంట్ల విద్యార్థినీ విమల ప్రథమ స్థానం, బోనకల్ విద్యార్థినీ మనస్విని ద్వితీయ స్థానంలో నిలవగా హెచ్ఎం గోపిచంద్ వీరికి మెమోంటోలను అందజేశారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు లోవేల్ కుమార్, నారాయణ, కొమ్ము శ్రీనివాసరావు, ఝాన్సీ, శ్రీనివాసరావు, వీరన్న, బంగారయ్య పాల్గొన్నారు.



వైరాలో ప్రతిభ చాటిన విద్యార్థులు



మధిరలో విజేతలకు ప్రశంసాపత్రాలు అందజేస్తున్న దృశ్యం